గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
Gtv GAUTHAM NEWS
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సీ ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.


# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక





హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 254, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, గురువారం - 24 - అక్టోబర్ - 2024

PUBLISHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### 58 ఏళ్లు జైలుశిక్ష అనుభవించి.. నిర్దోషిగా రిలీజైన వ్యక్తికి క్షమాపణలు చెప్పిన పోలీసు చీఫ్




1966లో ఓ మర్డర్ కేసులో ఐవా హకమడాను అరెస్టు చేశారు

88 ఏళ్ల హకమాడాకు ఆ కేసులో నిజానికి మరణశిక్ష విధించారు

### అణుశక్తి సామర్థ్యం ఉన్న నాలుగవ జలాంతర్గామిని ఆవిష్కరించిన భారత్

అక్టోబర్ 16న విశాఖపట్నంలో ప్రారంభించిన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్




జలాంతర్గామిలో 75 శాతం దేశీయంగా తయారీ

నావికాదళం సామర్థ్యం పెంపులో భాగంగా సిద్ధం

### లారెన్స్ బిష్ణోయ్ ని ఎన్ కౌంటర్ చేసే పోలీసు అధికారికి రూ. 1.11 కోట్లు ఇస్తాం: కర్ణిసేన చీఫ్

ఇటీవల ఎన్సీపీ నేత సిద్ధిఖీని హతమార్చిన బిష్ణోయ్ గ్యాంగ్




2023లో కర్ణిసేన చీఫ్ ను కాల్చి చంపిన వైనం

సల్మాన్ ఖాన్ కు కూడా బెదిరింపులు పంపుతున్న బిష్ణోయ్ గ్యాంగ్

### ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్.. త్వరలోనే కానిస్టేబుల్ పోస్టుల నియామకాలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు గుడ్‌న్యూస్ చెప్పారు. త్వరలోనే కానిస్టేబుల్ నియామకాలను చేపట్టనున్నట్టు సీఎం తెలిపారు. వైసీపీ హయాంలో అర్ధంతరంగా నిలిపివేసిన 6,100 పోలీసు కానిస్టేబుల్ పోస్టుల నియామక ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో గోషామహల్ మైదానం తరహాలో.. అమరావతిలో పోలీసు అమరవీరుల స్తూపం, స్మారక మైదానం నిర్మిస్తామని చెప్పారు. "గత ప్రభుత్వం పోలీసుల సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్, టీఏ బిల్లులు మొత్తం రూ.763 కోట్లు పెండింగ్ పెట్టింది.వాటిని క్లియర్ చేస్తాం. పోలీసు సంక్షేమం కోసం రూ.20 కోట్లు ఇస్తాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలో మావోల సమస్య, హైదరాబాద్ మతకలహాలు, రాయలసీమ ముఠాలు, ఎన్నో సామాజిక సమస్యల్ని పోలీసులు పరిష్కరించారు. దేశంలో ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పోలీసు వ్యవస్థ అగ్ర స్థానంలో ఉండేదని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. మళ్లీ ఆ గౌరవాన్ని దక్కించుకోవాలని ఆకాంక్షించారు.

# మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహం సిద్ధం

- రాంచీ నుంచి ఆరంభం.. బీజేపీ జార్ఖండ్ ప్రచార వ్యూహం అదేనా..?
- ఆ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు తగిన వ్యూహాలను అమలు చేయాలి
- ఎన్నికల్లో అన్నీ తానే అన్నట్టుగా ప్రధాని మోదీ ఒంటి చేతిపై ప్రచార బాధ్యతలు
- హర్యానా, జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ పరిమిత సంఖ్యలో సభలకు హాజరు



ఢిల్లీ: హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన విజయం ఇచ్చిన ఊపుతో భారతీయ జనతా పార్టీ త్వరలో జరగనున్న మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై దేశ ప్రజల్లో ఉన్న ఆదరణ చెక్కు చెదరకపోయినా.. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్న అంశాలు అనేకం ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో స్థానిక నాయకత్వానికి ప్రాధాన్యత ఇస్తూ, ఆ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులకు తగిన వ్యూహాలను అమలు చేయాలని భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో అన్నీ తానే అన్నట్టుగా ప్రధాని మోదీ ఒంటి చేతిపై ప్రచార బాధ్యతలు మోయడం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని కమలదళం గ్రహించింది. అందుకే హర్యానా, మిగతా..2లో




### బెంగళూరును ముంచెత్తిన భారీ వరద..

- 27 ఏళ్ల రికార్డ్‌ను బద్దలుకొట్టిన వర్షం
- గత కొద్ది రోజులుగా బెంగళూరులో భారీ స్థాయిలో వర్షాలు
- టెక్ సిటీ బెంగళూరును భారీ వరద ముంచెత్తింది
- అక్టోబర్ 1, 1997లో 178.9 మి.మీ వర్షం పాతం నమోదైంది
- తిరిగి 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంగళవారం తిరగరాసింది మిగతా..2లో

# ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత

- ధరణి స్థానంలో భూమాత.. నిర్వహణ బాధ్యతలు ఎన్ఐసీకి.. ఉత్తర్వులు జారీ
- గత ప్రభుత్వం తీసువచ్చిన ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు
- మూడేళ్ల పాటు ధరణి నిర్వహణ బాధ్యతలు నిర్వహించనుంది ఎన్ఐసీ
- ఎన్ఐసీ పనితీరు బాగుంటే మరో రెండేళ్లు నిర్వహణ బాధ్యతలను పొడిగించనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్




హైదరాబాద్: గత ప్రభుత్వం తీసువచ్చిన ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను ఎన్ ఐసీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ధరణి బాధ్యతలు నిర్వహిస్తున్న టెరాసిస్ ప్రైవేటు సంస్థను కాదని, కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మేటిక్ సెంటర్ కి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఎన్ఐసీతో కీలక ఒప్పందం చేసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడేళ్ల పాటు ధరణి నిర్వహణ బాధ్యతలు నిర్వహించనుంది ఎన్ఐసీ. ఎన్ఐసీ పనితీరు బాగుంటే మరో రెండేళ్లు నిర్వహణ బాధ్యతలను పొడిగించనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ తెలిపింది. టెరాసిస్ నుంచి ఎన్ఐసీకి అప్పగించడం ద్వారా దాదాపు కోటి రూపాయల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. అయితే ధరణి పోర్టల్‌కు చెందిన సాంకేతిక అంశాలను పూర్తి స్థాయిలో ఎన్ఐసీకి బదలాయించనున్నారు. నవంబరు 30వ తేదీ వరకు టెరాసిస్ సంస్థ సిబ్బంది మిగతా..2లో

### హైడ్రా ఉద్దేశం వేరే ఉందని నేను చెప్పిన మాటలు ప్రజలు నమ్ముతున్నారు



ఫతేనగర్ డివిజన్‌లో ఎంపీ బ్రేక్ ఫాస్ట్ మీటింగ్

ఢిల్లీకి వెళ్లినప్పుడు తప్ప ఎప్పుడూ నియోజకవర్గంలోనే ఉంటున్నానన్న ఈటల

అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి నిధులు కోరినట్లు వెల్లడి

మొదట మూసీ మురికి నీళ్లను శుద్ధి చేయాలని సూచన మిగతా..2లో



### ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానం..

- గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు
- కాంగ్రెస్, బీజేపీ అబద్దాలు బట్టబయలు అయ్యాయి
- ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది
- నిత్యం అసత్యాలు, అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్
- 2014-15 నుండి 2022-23 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది మిగతా..2లో

# మరో వాయుగుండం.. 'సైక్లోన్ దానా' దూసుకువస్తోంది

- తుపాన్ అలర్ట్.. ఈ జిల్లాల్లో భారీ వర్షాలు..
- తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం
- ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
- తుఫాన్ నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో భారీ వర్షాలు



అమరావతి/హైదరాబాద్: మరో వాయుగుండం.. 'సైక్లోన్ దానా' దూసుకువస్తోంది.. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ అలర్ట్ జారీ చేసింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ వాయుగుండంగా బలపడింది. ఇది దాదాపు పారాదీప్ (ఒడిశా)కి ఆగ్నేయంగా మిగతా..2లో

# సెక్యులరిజం భారత రాజ్యాంగంలో భాగమే.. మరోసారి తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు




న్యూఢిల్లీ , : 1976లో రాజ్యాంగాన్ని సవరించి 42వ రాజ్యాంగ సవరణ ద్వారా.. సెక్యులరిజం(లౌకిక వాదం), సోషలిస్ట్(సామ్యవాదం) అనే పదాలను చేర్చిన విషయం తెలిసిందే. అయితే రాజ్యాంగాన్ని రాసినప్పటి నుంచి ఈ పదాలు లేవని, వాటిని తొలగించాలని ఇప్పటికే ఎన్నోసార్లు.. ఎంతోమంది సుప్రీంకోర్టుకు ఎక్కారు. అయితే వాటన్నింటిపైనా గతంలోనే తీర్పులు వెలువరించిన అత్యున్నత న్యాయస్థానం.. సెక్యులరిజం, సోషలిస్ట్ అనే పదాలను తర్వాత చేర్చినా.. రాజ్యాంగంలో అవి ఇమిడి ఉన్నాయని తేల్చి చెప్పింది. 1973లో కేశవానంద భారతి వర్సెస్ మిగతా..2లో



### అనంతపురంలో భారీ వర్షం .. నీట మునిగిన కాలనీలు

- పండమేరు వాగు ఉధృతితో కాలనీలోకి వరద నీరు
- ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు
- హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు మిగతా..2లో

## 58 ఏళ్లు జైలుశిక్ష అనుభవించి..
## నిర్దోషిగా రిలీజైన వ్యక్తికి క్షమాపణలు చెప్పిన పోలీసు చీఫ్

టోక్యో: జపాన్ లో షిజుకా జిల్లాకు చెందిన పోలీసు బాస్.. ఓ నిర్దోషికి క్షమాపణలు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. 1966లో ఓ మర్డర్ కేసులో ఐవా హాకమడాను అరెస్టు చేశారు. 88 ఏళ్ల హాకమాడాకు ఆ కేసులో నిజానికి మరణశిక్ష విధించారు. కానీ అతను ఆ కేసులో అత్యున్నత కోర్టును ఆశ్రయించడంతో మూడు దశాబ్దాల పాటు వాదనలు జరిగాయి. ఆ తర్వాత మళ్లీ పునర్ దర్యాప్తుకు కోర్టు అంగీకరించింది. దీంతో 2014లో మళ్లీ అతనిపై ఉన్న కేసులో దర్యాప్తు చేపట్టారు. ఈసారి నిర్వహించిన విచారణలో హాకమడా నిర్దోషిగా తేలాడు. సుమారు 58 ఏళ్ల జైలు శిక్ష తర్వాత అతన్ని కోర్టు నిర్దోషిగా విడుదల చేసింది. ఈ మధ్యే ఇంటికి చేరుకున్న అతనికి ఆ జిల్లా పోలీసు చీఫ్ క్షమాపణలు చెప్పారు. విచారణలో పొరపాటు జరిగినట్లు తెలిపారు. మా వల్ల నీకు తీవ్రమైన మానసిక క్షోభ మిగిలిందని, అది మాటల్లో చెప్పలేమని, దానికి సారీ చెబుతున్నట్లు ఆ పోలీసు బాసు వెల్లడించారు.

## అణుశక్తి సామర్థ్యం ఉన్న
## నాలుగవ జలాంతర్గామిని ఆవిష్కరించిన భారత్

ఢిల్లీ: నావికాదళాన్ని మరింత బలోపేతం చేస్తూ అణుశక్తి సామర్థ్యం ఉన్న నాలుగవ బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామిని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ ప్రారంభించారు. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో (ఎస్‌బీసీ) అక్టోబరు 16న జలాంతర్గామిని ఆయన ఆవిష్కరించారు. నావికాదళంలో జలాంతర్గాముల సంఖ్య పెంపునకు రక్షణశాఖ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ అధునాతన జలాంతర్గామి అందుబాటులోకి వచ్చింది. ఈ జలాంతర్గామిలో 75 శాతం దేశీయంగా తయారైంది. ప్రస్తుతానికి దీనికి ఎస్4 అని పేరు పెట్టారు. అణు జలాంతర్గామి నౌకాదళాన్ని బలపరచడం ద్వారా ప్రత్యర్థులకు మన సత్తా చాటిచెప్పడంతో పాటు సుదీర్ఘ తీర ప్రాంతానికి భద్రతను అందించవచ్చని రక్షణరంగ నిపుణులు చెబుతున్నారు. ఇక అణుశక్తితో నడిచే మూడవ జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిధామాన్ తయారీ ప్రక్రియ ఇప్పటికే కొనసాగుతోంది. వచ్చే ఏడాది ఇది అందుబాటులోకి రానుంది. మరో రెండు అణు జలాంతర్గాములు ఐఎన్ఎస్ అరిహంత్, ఐఎన్ఎస్ అర్ఘత్ ఇప్పటికే భారత నౌకాదళంలో చేరాయి. ఐఎన్ఎస్ అరిఘాట్‌ను ఈ ఏడాది ఆగస్టులో ఆవిష్కరించారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని అణుశక్తితో నడిచే రెండు ఎటాక్ సబ్‌మెరైన్లను తయారు చేయడానికి కేబినెట్ కమిటీ ఆఫ్ సెక్యూరిటీస్ (సీసీఎస్) అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. కాగా ఆధునిక ప్రపంచంలో ఎటు ఎలాంటి అనూహ్యమైన ప్రతికూల పరిస్థితి ఎదురైనా ధీటుగా ఎదుర్కొనేందుకు ఆయుధ సంపత్తిని బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం నిరంతర ప్రయత్నాలను కొనసాగిస్తోంది.

## లారెన్స్ బిష్ణోయ్ ని ఎన్ కౌంటర్ చేసే
## పోలీసు అధికారికి రూ. 1.11 కోట్లు ఇస్తాం: కర్ణిసేన చీఫ్

ఢిల్లీ: గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ను చంపిన ఏ పోలీసు అధికారికైనా రూ. 1,11,11,111 బహుమతిగా ఇస్తామని క్షత్రియ కర్ణిసేన జాతీయ అధ్యక్షుడు రాజ్ షెకావత్ బహిరంగ ప్రకటన చేశారు. తమ అమరవీరుడు సుఖ్ దేవ్ సింగ్ హత్యకు లారెన్స్ బిష్ణోయ్ కారణమని ఆయన అన్నారు. సబర్మతి జైలు నుంచి లారెన్స్ బిష్ణోయ్ బెదిరింపులకు సంబంధించి కేంద్రం, గుజరాత్ ప్రభుత్వాలపై షెకావత్ అసహనం వ్యక్తం చేశారు. 2023 డిసెంబర్ 5న అప్పటి కర్ణిసేన చీఫ్ అయిన సుఖ్ దేవ్ సింగ్ ను దారుణంగా కాల్చి చంపారు. ఈ ఘటన జరిగిన కాసేపటికే... హత్యకు తామే కారణమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. సరిహద్దుల వద్ద డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో లారెన్స్ బిష్ణోయ్ అరెస్ట్ అయ్యాడు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ నివాసం ఎదుట కాల్పులు జరిపింది కూడా బిష్ణోయ్ గ్యాంగే. ఇటీవల జరిగిన ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ హత్యకు తామే కారణమని బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది.

## బెంగళూరును ముంచెత్తిన భారీ వరద..

బెంగళూరు: టెక్ సిటీ బెంగళూరును భారీ వరద ముంచెత్తింది. మంగళవారం రికార్డ్ స్థాయిలో వర్షం కుమ్మేసింది. దీంతో రోడ్లు, ఇళ్లు నీటమునిగాయి. కార్లు, బైకులు కొట్టుకుపోయాయి. జనజీవనం అస్తవ్యస్థం అయిపోయింది. ఇక ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిన్నెలతో నీళ్లు బయటకు పంపిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గత కొద్ది రోజులుగా బెంగళూరులో భారీ స్థాయిలో వర్షాలు కురుస్తున్నాయి. ఇక మంగళవారం అయితే రికార్డు స్థాయిలో వర్షం కురిసినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉదయం 8:30 గంటల నుంచి 186.2 మి.మీ వర్షం పాతం నమోదైనట్లు పేర్కొంది. అక్టోబర్ 1, 1997లో 178.9 మి.మీ వర్షం పాతం నమోదైంది. తిరిగి 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంగళవారం తిరగరాసింది. ఈ రోజంతా కూడా ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

యలహంకలో తీవ్ర వరదలు..

మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం నివాసం ఉండే యెలహంక, కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ వారం వ్యవధిలో వరదలకు గురవడం ఇది రెండోసారి. కాంప్లెక్స్‌లోని నివాసితులు మంగళవారం ఉదయం నడుము లోతులో నీరులో మునిగిపోయారు. కార్లు మరియు ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది.. బోట్లలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. బెంగళూరులో ఎటుచూసినా నీళ్లే ఉన్నాయి. అన్ని ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. వరద నీటిలో ప్రజాప్రతినిధుల ఇళ్లు కూడా మునిగిపోయాయి.

## ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానం..

హైదరాబాద్ : గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు.. ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని నిత్యం అసత్యాలు, అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్థిక నిర్వహణ ఎలా ఉందో చెప్పడానికి ఈ సాక్ష్యం సరిపోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రిపోర్టుతో కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు బట్టబయలు అయ్యాయని, ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్నారు. 2014-15 నుండి 2022-23 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. ఈ సమయంలో ఆర్థిక నిర్వహణలో తెలంగాణ ఓ వెలుగు వెలిగిపోయింది. డెబ్ట్ మేనేజ్‌మెంట్ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్‌లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేసీఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం అసాధారణమైన ఆర్థిక వివేకం, క్రమశిక్షణను ప్రదర్శించిందని స్పష్టమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో రాష్ట్రం దివాళా తీసిందంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న బూటకపు ప్రచారానికి తెరపడింది. కాంగ్రెస్ నాయకత్వమే ఇవాళ దివాళా తీసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ, 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ పార్టీ యొక్క సమర్థవంతమైన పాలనకు ఈ విజయం నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైడ్రా ఉద్దేశం వేరే ఉందని
## నేను చెప్పిన మాటలు
# ప్రజలు నమ్ముతున్నారు

హైదరాబాద్: హైడ్రా ఉద్దేశం వేరే ఉందని, తాను చెప్పిన ఈ మాటలను ప్రజలు ఇప్పటికీ నమ్ముతున్నారని బీజేపీ నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఫతేనగర్ డివిజన్‌లో ఈరోజు బ్రేక్ ఫాస్ట్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించి నాలుగు నెలలు దాటిందని, ఈ కాలంలో ఢిల్లీ వెళ్ళినప్పుడు తప్ప ప్రతిరోజు నియోజకవర్గంలోనే ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు. "ఎంత తిరిగినా ఒడవని (తరగని) నియోజకవర్గం ఇది... ఎంత విన్నా ఒడవని (తరగని) గాథ ఉంది ఇక్కడ" అన్నారు. కలెక్టర్‌ను, హెచ్ఎండిఏ కమిషనర్‌ను, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఎండిని... ఇలా అందరినీ వివిధ అభివృద్ధి పనులపై కలిశామని, ఎమ్మెల్యేలతో కలిసి అధికారుల వద్దకు వెళ్లినట్లు తెలిపారు. కేంద్రంలో అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిని కూడా కలిసి స్వచ్ఛ భారత్, స్మార్ట్ సిటీ కింద డబ్బులు కోరినట్లు చెప్పారు. చెరువుల్లోకి మురుగునీరు వెళ్లకుండా... దారి మళ్లించేందుకు గతంలో 'స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని తీసుకు వచ్చారని, ఈ కార్యక్రమానికి కొన్ని నిధులు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. మూసీ ప్రక్షాళన విషయం తర్వాత చూసుకోవచ్చు... ముందు మురికి నీళ్లను శుద్ధి చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రసాయన వ్యర్థాలను శుద్ధి చేస్తేనే మూసీ బాగుపడుతుందని పేర్కొన్నారు. మూసీ ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, కానీ చేస్తున్న పద్ధతికి మాత్రం వ్యతిరేకమే అన్నారు. సమస్యలపై తాము కొట్లాడుతున్నప్పుడు ప్రజల సహకారం ఉండాలన్నారు.

## అనంతపురంలో భారీ వర్షం .. నీట మునిగిన కాలనీలు



అనంతపురం: అనంతపురంలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షం, వాగు ఉద్ధృతితో జన జీవనం స్తంభించిపోయింది. కాలనీలు నీట మునిగాయి. నగరానికి అనుకుని ఉన్న పండమేరు వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతికి వాగుకు ఇరువైపులా ఉన్న కాలనీల్లోకి నీరు చేరుకుంది. కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. వరద ప్రవహం పెరగడంతో ప్రజలు ఇళ్లపైకి ఎక్కి సాయం కోసం ఎదురుచూశారు. వెంటనే అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధిత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.పండమేరుకు వరద పోటెత్తడంతో ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ పూర్తిగా నీట మునిగింది. మరో వైపు కనగానపల్లి మండలం ముక్తాపురం చెరువు అలుగు పారడంతో జాతీయ రహదారి పైకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. స్థానిక పెట్రోల్ బంక్ లోకి నీరు చేరింది. కనగానపల్లి చెరువు కట్ట తెగి వరద పంటమేరులోకి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. పండమేరు వాగు ఉద్ధృతితో హైదరాబాద్ - బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పుట్టపర్తి వద్ద చిత్రావతి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

# మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వ్యూహం సిద్ధం



అందుకే హర్యానా, జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ పరిమిత సంఖ్యలో సభలకు హాజరయ్యారు. పదునైన ప్రసంగాలతో ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. వీలైనంతమేర స్థానిక నాయకత్వానికే ప్రాధాన్యత కల్పించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న హర్యానాలో మోదీ తన నాయకత్వం కంటే నాయబ్ సింగ్ సైనీ నాయకత్వంపై ప్రజలకు భరోసా కల్పించగలిగారు. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే తరహాలో పరిమిత సంఖ్యలో సభలకు హాజరుకావాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్టు తెలిసింది. జార?ండ్ రాజధాని రాంచీతో మొదలుపెట్టి, జార్ఖండ్ లోని 6 ప్రాంతాలను కవర్ చేసేలా మొత్తం 7 ప్రచార సభల్లో ఆయన పాల్గొననున్నారు.

చిన్న రాష్ట్రం - 6 ప్రాంతాలు

వైశాల్యంలో, జన సంఖ్యలో జార?ండ్ చిన్న రాష్ట్రమే అయినప్పటికీ ఈ రాష్ట్రాన్ని భౌగోళికంగా 6 ప్రాంతాలుగా విభజిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ, దక్షిణ కోస్తా మాదిరిగా జార్ఖండ్ లో పాలము, సంతాల్ పరగణ, కొల్హాల్, ఉత్తర చోటానాగ్‌పూర్, దక్షిణ చోటానాగ్‌పూర్, కోయిలాంచల్ ప్రాంతాలున్నాయి. బొగ్గు, ఇతర ఖనిజాల గనులు అధికంగా ఉన్న కోయిలాంచల్‌లో ధన్‌బాద్, బొకారో, గిరిడిహ్ పట్టణాలున్నాయి. బీజేపీ సంస్థాగతంగా రాష్ట్రంలో ప్రతి ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అన్ని ప్రాంతాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తే అధికారం సాధ్యపడుతుందని భావిస్తోంది. అందుకో ప్రతి ప్రాంతంలో ప్రధాని మోదీతో ఒక సభ ఉండేలా ఏర్పాట్లు చేసింది. అలాగే రాష్ట్ర రాజధాని రాంచీ నగరంలో ఒక బహిరంగ సభ ఉండాలని నిర్ణయించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ నాయకత్వానికి ప్రతిపాదనలు పంపించినట్టు తెలిసింది.

అభ్యర్థుల జాబితా - అసంతృప్తి సెగలు

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ 66 మంది అభ్యర్థుల పేర్లను ఇప్పటికే ప్రకటించింది. జాబితాలో బాబులాల్ మరాండీ, చంపై సోరెన్, సుదర్శన్ భగత్ వంటి ప్రముఖులున్నారు. సెరైకెలా నుంచి మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్‌ను పార్టీ అభ్యర్థిగా నిలబెట్టింది. హేమంత్ సోరెన్ ఈడీ కేసులో జైలుపాలైనప్పుడు చంపై సోరెన్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న విషయం తెలిసిందే. బెయిల్ మీద బయటికొచ్చిన హేమంత్ సోరెన్, చంపైను అవమానకరరీతిలో సీఎం పీఠం నుంచి దించేశారు. దీంతో ఆయన ఎన్నికలకు కొద్ది నెలల ముందు బీజేపీలో చేరారు. ఆయన గిరిజన-ఆదివాసీ వర్గాల్లో పట్టున్న నేత. మరోవైపు గండే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న హేమంత్ సోరెన్ సతీమణి కల్పనా సోరెన్‌పై మునియా దేవిని బీజేపీ బరిలోకి దించింది. తొలి జాబితా విడుదల చేసినప్పటి నుంచి పార్టీలో అసంతృప్తి సెగలు రాజుకున్నాయి. రాజకీయాల్లో టికెట్ ఆశించి భంగపడ్డవారు అసమ్మతి స్వరాన్ని వినిపించడం ఎక్కడైనా సహజమే. కానీ ప్రతిపక్షాల చేతిలో ఉన్న ఈ రాష్ట్రంలో మళ్లీ అధికారం సాధించాలని భావిస్తున్న బీజేపీ, ఏ చిన్న అవకాశాన్ని వదులుకోకూడదని భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో అసంతృప్తి సెగలు, అసమ్మతి రాగాల కారణంగా నష్టం జరగకూడదని కోరుకుంటోంది. అభ్యర్థుల జాబితా విడుదల చేసిన తర్వాత బీజేపీకి చెందిన పలువురు ప్రముఖ నేతలు పార్టీని వీడారు. వారిలో లూయిస్ మరాండి, కేదార్ హజ్రా, కునాల్ సారంగి, గణేష్ మహాలి, లక్ష్మణ్ తుడు, బాస్కో బెస్రా వంటి నేతలున్నారు. వీరంతా అధికార జార?ండ్ ముక్తి మోర్చా పార్టీలో చేరారు. ఇదిలా ఉంటే.. బంధుప్రీతి, కుటుంబ వారసత్వ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించే భారతీయ జనతా పార్టీ ఈ రాష్ట్రంలో ఒకే కుటుంబానికి చెందిన పలువురికి టికెట్లు ఇచ్చిందన్న ఆరోపణ, విమర్శలు ఎదుర్కొంటోంది. ఇతర పార్టీల నుంచి వచ్చిన ఒకే కుటుంబ నేతలు కొందరు ఉండగా, పార్టీ నేతల్లో కొందరి బంధువర్గానికి కూడా టికెట్లు ఇచ్చిందని జేఎంఎం నేతలు ఆరోపిస్తున్నారు.

గనుల రాష్ట్రంలో చొరబాట్లు

జార్ఖండ్ రాష్ట్రం విలువైన ఖనిజాలు, గనులకు పెట్టింది పేరు. అలాంటి రాష్ట్రంలో బంగ్లాదేశీయుల చొరబాట్లు ఒక సమస్యగా మారింది. ఓటుబ్యాంకు రాజకీయాలతో బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలసవచ్చినవారిని పశ్చిమ బెంగాల్ సాదరంగా స్వాగతిస్తుంటే, అలా వచ్చినవారిలో కొందరు బెంగాల్‌కు ఆనుకున్న జార్ఖండ్ లో కూడా స్థిరపడుతున్నారు. దీంతో ఆ రాష్ట్రంలో సామాజిక స్వరూపం మారిపోతోంది. దీంతో ఈ ఎన్నికల్లో ప్రధాని మోదీతో పాటు కమలదళం నేతలు అక్రమ మైనింగ్, బంగ్లాదేశీయుల చొరబాట్లు, లవ్ జిహాద్, జనాభా మార్పు, క్రైస్తవ మతప్రచారకులు ప్రలోభాలతో గిరిజన-ఆదివాసీలను మతమార్పిళ్లు చేయడం వంటి అంశాలను ఎక్కుగా ప్రస్తావించే అవకాశం ఉంది. రాంచీలో ఏర్పాటు చేసే తొలి సభలో ప్రధానమంత్రితో పాటు మిత్రపక్షాల నాయకులు నితీష్ కుమార్, చిరాగ్ పాశ్వాన్, సుధేష్ మహతో కూడా వేదికపై ఉంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జార్ఖండ్ లోని 81 స్థానాలకు రెండు దశల్లో పోలింగ్ జరగనుంది. నవంబర్ 13న తొలి దశ పోలింగ్ జరగనుంది. నవంబర్ 20న రెండో దశ పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 23న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం జార?ండ్‌లో మొత్తం 2.6 కోట్ల మంది ఓటర్లు కొత్త ప్రభుత్వాన్ని నిర్ణయించనున్నారు.

# ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత

మొదటి పేజి తరువాయి




నవంబరు 30వ తేదీ వరకు టెరాసిస్ సంస్థ సిబ్బంది ఎన్ఐసీకి సహకరిస్తారని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత

మరోవైపు ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత పేరుతో పోర్టల్ ఏర్పాటుకు సర్కార్ కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ధరణి వైఫల్యాలను అధిగమించే లక్ష్యంతో క్షేత్రస్థాయి అధ్యయానికి శ్రీకారం చుట్టింది. త్వరలో దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చే పనిలో పడింది. ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వ ఎన్ఐసీకి బదలాయింపు ప్రక్రియను సర్కార్ ఇటీవల పూర్తిచేసింది. ఇక పేరు మార్పు మారిస్తే ప్రక్రియ పూర్తవుతుంది. ధరణి పోర్టల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ ద్వారా దాదాపు పరిష్కరించారు. కొత్త చట్టంతో ముడిపడి ఉన్న అంశాలకు సంబంధించిన దరఖాస్తులే మిగిలిపోయినట్లు సంబంధిత వర్గాల సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ధరణి సమస్యలకు చరమగీతం పాడాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ క్రమంలోనే ధరణి పోర్టల్ సమస్యలపై ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చేత క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించారు. అందులో సేకరించిన విషయాలన్నింటినీ క్రోడీకరించి కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. క్షేత్రస్థాయిలో భూ సమస్యల అధ్యయానికి రాష్ట్రంలో రెండు మండలాలను ఎంపిక చేసింది. అందులో ఒకటి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి మండలం. ఇక రెండోది రంగారెడ్డి జిల్లా యాచారం మండలం. నిర్ణీత కాలంలో భూ సమస్యలను పరిష్కరించి ఇక్కడ వచ్చిన ఫలితాల ద్వారా ఇదే నమూనాను రాష్ట్రమంతటా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.


## మరో వాయుగుండం..
## 'సైక్లోన్ దానా' దూసుకువస్తోంది

మొదటి పేజి తరువాయి

ఇది దాదాపు పారాదీప్ (ఒడిశా)కి ఆగ్నేయంగా 730 కి.మీ., సాగర్ ద్వీపానికి (పశ్చిమ బెంగాల్) దక్షిణ ఆగ్నేయంగా 770 కి.మీ, ఖేపుపరా (బంగ్లాదేశ్)కి ఆగ్నేయంగా 740 కి.మీ. దూరంలో ఉంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా పయనించి, తూర్పు మధ్య బంగాళాఖాతంలో నేటికి (అక్టోబర్ 23) నాటికి తుపానుగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత, వాయువ్య దిశగా కదులుతూ గురువారం (అక్టోబర్ 24) ద్వారా వాయువ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడుతుంది. ఆ తరువాత అక్టోబర్ 24వ తేదీ రాత్రి - అక్టోబర్ 25 ఉదయంలోపు ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ సమీపంలో పూరీ, సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. దీని ప్రభావంతో అక్టోబరు 24 - 25న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పశ్చిమమధ్య బంగాళాఖాతం తీరాల వెంబడి గంటకు 40-60కిమీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. సముద్రం అలజడిగా ఉంటుందని.. అక్టోబరు 25 వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని సూచించింది.. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. విపత్తుల నిర్వహణ సంస్థ ప్రకటన విడుదల చేసింది. తుఫాన్ నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి.. పండమేరు వాగు ఒకసారిగా ఉప్పొంగి కాలనీలను ముంచేసింది. వరదల ధాటికి బైకులు, ఆటోలు ఆ ప్రవాహంలో కొట్టుకుపోయాయి. వాగులు, వంకలు పొంగుతుండటంతో హైదరాబాద్-బెంగళూరు రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆకస్మిక వరదల నేపథ్యంలో అధికారులు అలర్ట్ అయ్యారు. ఏమైనా సహాయసహకారాలు కావాలంటే తమకు సమాచారం అందించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజలకు సూచించారు. ఈ మేరకు వరద ప్రాంతాల్లో పర్యటించారు.

## సెక్యులరిజం భారత రాజ్యాంగంలో భాగమే..
## మరోసారి తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు

మొదటి పేజి తరువాయి




1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో.. లౌకిక, సామ్యవాద అనే పదాలు రాజ్యాంగంలో భాగమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఆ తర్వాత రాజ్యాంగ సవరణ చేసి.. వాటిని చేర్చారు. అయితే దీనిపై ఎన్నిసార్లు సుప్రీంకోర్టు ఇదే వ్యాఖ్యలు చేసినా మళ్లీ మళ్లీ పిటిషన్లు దాఖలు అవుతూనే ఉన్నాయి. తాజాగా దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు మరోసారి అదే తేల్చి చెప్పింది.రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులర్, సామ్యవాద పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి సహా పలువురు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్, లాయర్ విష్ణు శంకర్ జైన్ వాదనలు వినిపించారు. 1976లో రాజ్యాంగానికి చేపట్టిన 42వ సవరణపై అప్పటి పార్లమెంట్‌లో చర్చ జరగలేదని తెలిపారు. దానికి స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలకు వివిధ వివరణలు ఉన్నాయని.. వాటిని వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని వెల్లడించారు. అదే సమయంలో గతంలో ఎన్నోసార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా కోర్టులు చెప్పాయని గుర్తు చేశారు.సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని.. అది సమానత్వాన్ని ప్రతిబింబిస్తుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. దీన్ని మరో రకంగా చూడకూడదని.. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుందని వెల్లడించారు. ఇక ఇదే విషయం సెక్యులర్ విషయంలోనూ అంతే అంటూ వ్యాఖ్యానించారు. ఇక వాదనలు వినిపించిన మరో లాయర్ అశ్విని ఉపాధ్యాయ్.. ఈ 42వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చే నాటికి అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ.. దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే దానికి స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. భారత్ లౌకిక దేశంగా ఉండాలని మీరు అనుకోవడంలేదా అంటూ సూటిగా ప్రశ్నించారు.దీనిపై స్పందించిన విష్ణు శంకర్ జైన్.. భారత్ లౌకిక దేశంగా ఉండకూడదని తాము అనడం లేదని.. అయితే ఆ సవరణను మాత్రమే సవాల్ చేసినట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ పీఠికలో సెక్యులర్, సోషలిస్ట్ అనే పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్లు అయిందని.. అయితే అధి భవిష్యత్తులో ప్రజాస్వామ్యం అనే పదాన్ని కూడా తొలగించవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు.ఆ తర్వాత వాదనలు వినిపించిన సుబ్రహ్మణ్య స్వామి.. రాజ్యాంగ పీఠికలో 1949 నవంబర్ 26వతేదీ ఉండటం తప్పని తాను నిరూపిస్తానని తెలిపారు. భారత రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు.. కానీ సెక్యులరిజం, సోషలిజం అనే పదాలు చేర్చడానికి దేశ ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదని అన్నారు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానిని తేదీతో, మరో దానికి తేదీ లేకుండా ఉంచవచ్చని సుబ్రహ్మణ్య స్వామి పేర్కొన్నారు. ఈ వాదనలపై స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. సంబంధిత పత్రాలను పిటిషనర్లు సమర్పిస్తే వాటిని పరిశీలిస్తామని చెప్పారు. కానీ దీనిపై నోటీసులు జారీ చేయడానికి మాత్రం బెంచ్ అంగీకరించలేదు. అనంతరం విచారణను వచ్చే నెల 18వ తేదీకి వాయిదా వేశారు.

## నారా లోకేష్‌కు పెరిగిన బాధ్యతలు..

పార్టీతోపాటు, ప్రభుత్వ వ్యవహారాల్లో దూకుడు

: టీడీపీని తెరవెనుక మంత్రి నారా లోకేష్ హ్యాండిల్ చేస్తున్నారా? సీఎం చంద్రబాబు.. చిన్నబాబుకే పగ్గాలు అప్పగించారా? చీటికి మాటికీ బీజేపీ పెద్దలకు కలవడం వెనుక అదే కారణమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.టీడీపీలో మంత్రి నారా లోకేష్ పాత్ర క్రమంగా పెరుగుతోంది. పార్టీతోపాటు ప్రభుత్వ బాధ్యతలు చిన్నబాబుకు సీఎం చంద్రబాబు అప్పగించినట్టు అంతర్గతంగా పార్టీలో చిన్నపాటి చర్చ మొదలైంది. కీలకమైన విషయాలను నారా లోకేష్ ఎలా హ్యాండిల్ చేస్తున్నారనేది దగ్గరుండి గమనిస్తున్నారు సీఎం చంద్రబాబు.వాజ్‌పేయి హయాంలో పలుమార్లు ఢిల్లీకి వెళ్లేవారు సీఎం చంద్రబాబు. కీలక విషయాల్లో ఎన్డీయే పెద్దలను ఒప్పించేవారు. ఓ వైపు.. మరోవైపు ప్రభుత్వ బాధ్యతలు చూసుకునే వారు. ప్రస్తుతం ఏపీలో టీడీపీని గమనిస్తే అప్పుడు పరిస్థితి కంటిన్యూ అవుతుందని అంటున్నారు. కాకపోతే చంద్రబాబు స్థానంలో నారా లోకేష్ తెర వెనుక చక్ర తిప్పుతున్నారని అంటున్నారు.లేటెస్ట్‌గా ఢిల్లీ వెళ్లిన మంత్రి నారా లోకేష్.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. దాదాపు 45 నిమిషాల సేపు ఇరువురు మధ్య సమావేశం జరిగింది. నేతల మధ్య అంతర్గతంగా ఏం జరిగిందన్న విషయం కాసేపు పక్కనబెడదాం.ఏపీని ఆర్థికంగా కీలక స్థానంలో నిలబెట్టేందుకు అమిత్ షా అందిస్తున్న సహకారం మరువలేమని ఎక్స్‌లో రాసుకొచ్చారు మంత్రి నారా లోకేష్. గతంలో అమిత్ షా అపాయింట్మెంట్ దొరకడం కష్టంగా ఉండేది. అడిగిన వెంటనే నారా లోకేష్‌కు ఇస్తున్నారు.స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు తెర వెనుక ఉండి వ్యవహారాలను నడిపించారు నారా లోకేష్. ఢిల్లీలో మకాం వేసి బీజేపీ పెద్దలతో మాట్లాడేవారు. నారా లోకేష్ దౌత్యం ఫలించింది.. సొంత పార్టీ నేతల్లో నమ్మకం కలిగింది. దీంతో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఢిల్లీ వ్యవహారాలను మంత్రి నారా లోకేష్‌కు అప్పగించారట సీఎం చంద్రబాబు.ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండో-అమెరికా బిజినెస్ వ్యవహారాలను మంత్రి నారా లోకేష్ స్వయంగా చూసుకున్నారు. నేషనల్ మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వడం మొదలుపెట్టారు. తత్తరబాటు లేకుండా ఛానెళ్ల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానం చెప్పారు. ఏపీకి ఏం చెయ్యాలనుకుంటున్నామో అన్నది క్లియర్‌గా చెప్పారు. సీఎం చంద్రబాబు హస్తినకు వెళ్తే నేషనల్ మీడియా ఆయన చుట్టూ తిరిగేది.. ఇప్పుడు మంత్రి నారా లోకేష్ వంతైందన్నది పార్టీ సీనియర్ నేతల మాట.

## ప్రతీ జంట 16 మంది పిల్లల్ని కనండి..
## చంద్రబాబు వ్యాఖ్యలకు స్టాలిన్ మద్దతు



చెన్నై, : తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. జనాభా నియంత్రణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన స్టాలిన్.. ప్రతీ ఒక్కరు 16 మంది పిల్లలను కనాలనే ఆలోచనతో ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేశాయని.. అయితే దాని వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయి, లోక్‌సభ నియోజకవర్గాలు కూడా తగ్గుతున్నాయని తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్న వేళ.. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గిపోతోందని.. కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో కేటాయింపులో కోత పడొచ్చన్న ఊహాగానాలు వెల్లువెత్తుతున్న వేళ.. స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.తిరువాన్మియూర్‌లోని మరుంధీశ్వరార్ ఆలయ కళ్యాణ మండపంలో రాష్ట్ర హిందూ మత, ధర్మాదాయ శాఖ సోమవారం నిర్వహించిన సామూహిక జంటల కళ్యాణోత్సవానికి సీఎం ఎంకే స్టాలిన్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన స్టాలిన్.. జనాభా నియంత్రణ గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. కొత్తగా పెళ్లయిన జంటలు 16 రకాల ఆస్తులను పొందాలని పూర్వ కాలంలో పెద్దలు ఆశీర్వాదించేవారని.. ఇప్పుడు ఆస్తికి బదులుగా 16 మంది పిల్లలను కనాలని, వారు ఆనందంగా జీవించాలని దీవించండి అంటూ స్టాలిన్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ కారణంగా రాష్ట్రాల్లో పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్య తగ్గిపోతోందని.. పరిస్థితులకు తగ్గట్టుగా మనం మారాలని తెలిపిన స్టాలిన్.. ప్రతి ఒక్కరూ 16 మంది పిల్లలను కనాలని సూచించారు.అయితే జనాభా నియంత్రణ గురించి.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల ఇలాంటి వ్యాఖ్యలే చేయడం విశేషం. జనాభా సమతుల్యత, వృద్ధాప్య జనాభా పెరుగుతుండటంపై చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కనాలని చంద్రబాబు సూచించారు. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వ్యక్తులు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనుమతించే చట్టాన్ని తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వెల్లడించారు.

## సీసీ రోడ్ల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండల గోలియాతండ గ్రామపంచాయతిలో డి.ఎం.ఎఫ్.టీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలు అన్ని పేదలకు అందరికి అందుతాయన్నారు. ప్రతిపక్ష నాయకులు వారి రాజకీయ లబ్ది కోసం, ఎవరు ఎన్నిమాయమాటలు చెప్పినా ఎవరు నమ్మకూడదని, మీరందరు నాకు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపి మీకు సేవ చేసే భాగ్యం కలిగించినందుకు మీకు ఎప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంపీడీవో రవీందర్ రావు, ఎంపీవో గణేష్ గాంధీ, సిఐ సురేష్,బోడు ఎస్ఐ శ్రీకాంత్, కార్యదర్శి వీ.ప్రశాంత్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్య దేవా, మాజీ సర్పంచ్ బోడ నిరోషా మంగీలాల్ నాయక్, బోడ సరిత, బండ్ల రజినిశ్రీనివాస్, ఇస్లావత్ రెడ్యానాయక్, ఈది గణేష్,మూడు సంజయ్, సర్దార్, రవి, గడ్డం మధురెడ్డి, శంకర్, మాదే మధు, పోషాలు, అనంతుల వెంకన్న, బోడ హరిలాల్ నాయక్,సామ్య, శ్రీను, మంగ్య పాల్గొన్నారు.



## శంఖుస్థాపన చేసి రెండేళ్లు.బిటి రోడ్డు నిర్మాణం ఎప్పుడు..?




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి మండలం శంభుని గూడెం టీడబ్ల్యూ రోడ్డు నుంచి రాజుతండా వయా గోప్యతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంఖుస్థాపన చేసి రెండేళ్లు గడిచింది. ఎస్ టీఎస్ డిఎఫ్ 2022-2023 గ్రాంటుతో రూ.1.60 కోట్లతో గత ప్రభుత్వ కాలంలో దాదాపు రెండు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటికీ పనులు ప్రారంభించక పోవడంతో రాజు తండా, గోప్యతండా ప్రజలు రోడ్లపై నీరు నిలిచిపోవడంతో అనేక వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. దీనితో కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఉన్నత అధికారులు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవ తీసుకొని నిర్లక్ష్యం వహిస్తున్న ఆ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని రోడ్డు త్వరగా వేయాలని గ్రామంలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని. వారు అధికారులు వేడుకున్నారు, ఈ కార్యక్రమంలో, గ్రామస్తులు భూక్యా రాజా నాయక్, భద్రు నాయక్, బాలు నాయక్, సోమని, జుంకీలాల్, కొర్ర రమేష్, నరేష్, రెడ్యా, సుమన్ రవి వెంకమ్మలు కోరుతున్నారు.

## కొత్తగూడెం నియోజకవర్గానికి మంజూరైన ఈఎస్ఐ ఆస్పత్రి

### పాల్వంచ ఆస్పత్రి 100 పడకలుగా 'అప్ గ్రేడ్'కు అనుమతులు.

### ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతాం ఎమ్మెల్యే కూనంనేని.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ వైద్య శాలలపై ప్రత్యేక దృష్టి సారించిన కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆస్పత్రుల్లో కావాల్సిన మౌలిక వసతులు, వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ, భవనాలు వంటి సమస్యల పరిస్కారంకోసం నిరంతరం చేస్తున్న కృషి ఫలితాన్ని ఇస్తోంది. ఏజెన్సీ గ్రామాలకు కేంద్రంగా, పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి ప్రస్తుతం 50 పడకల ఆస్పత్రిగా కొనసాగుతుండగా రోగుల సంఖ్యకు అనుగుణంగా వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని పలుమార్లు సంబంధిత మంత్రులపై వత్తిడి తెచ్చి సంప్రదింపులు జరిపిన ఫలితంగా వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు అనుమతులు లభించాయి. అదేవిధంగా కొత్తగూడెం ప్రధాన ఆస్పత్రిలో ఐదు డియాలసిస్ మేషన్లు అందుబాటులో ఉండగా మరో పది మిషన్లు మంజూరు చేయాలనీ ఎమ్మెల్యే కోరడంతో మొదటివిడతగా ఐదు మిషన్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో కొత్తగూడెం ఆస్పత్రిలో పది మిషన్లు డయాలసిస్ రోగులకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా, నియోజకవర్గ కేంద్రంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని పలుమార్లు సంబంధిత మంత్రులపై వత్తిడి తెచ్చిన ఫలితంగా ఈ ఆస్పత్రి ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసిన ప్రభుత్వం అందుకు సంబందించిన ఉత్తర్వులు జారీచేసింది. ఆస్పత్రుల్లో మందుల, వైద్య పరికారాల కొరతను గుర్తించి సంబంధిత ప్రతిపాదనలు వైద్యశాఖకు సమర్పించడంతో వాటిని సమకూర్చేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి జరుగుతోందని, పేదలకు మెరుగైన ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. పాల్వంచ ఆస్పత్రి అప్ గ్రేడేషన్, కొత్తగూడెం ఆస్పత్రిలో డయాలసిస్ మిషన్లు పెంపు, ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు తదితర అనుమతులు లభించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని కూనంనేని తెలిపారు.

## ప్రభుత్వ జూనియర్.కళాశాలకు కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలి



గార్ల (గౌతమ్ న్యూస్): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రహరీ గోడ నిర్మించి, వసతులు మెరుగుపరచాలని పిడిఎస్యు మండల కార్యదర్శి మహేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన విషయంలో గతంలో మాజీ ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, ప్రస్తుతం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యలకు పిడిఎస్యు ఆధ్వర్యంలో శ్రేణులను కలుపుకొని వినతి పత్రాలు సమర్పించామని ఆయన వెల్లడించారు. కళాశాలకు ప్రహరీ గోడ లేకపోవడం కారణంగా పసుపక్షాదులు ఇష్టాను రీతిలో తిరుగుతూ వ్యర్థాలను కళాశాల పరిధిలో వదిలి వేయడం ద్వారా దుర్గంధం వెదజల్లుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల తిరగడం ద్వారా కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం కాలేజీకి అనుబంధంగా హాస్టల్ వసతిని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కళాశాలకు తక్షణమే ప్రహరీ గోడ నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## సౌందర్య ఫ్యాన్సీ కంగన్ హాల్ ప్రారంభించిన

### కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ - పల్లవి



మానుకోట జిల్లా ప్రతినిధి (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కేలోత్ సాయి కుమార్ అత్యాధునిక హంగులతో సౌందర్య ఫ్యాన్సి కంగన్ హాల్ ప్రారంభించారు. ఫ్యాన్సీ కంగన్ హాల్ కు ముఖ్య అతిథిగా కిసాన్ పరివార్ సీఈఓ కుటుంబ సమేతంగా డాక్టర్ వివేక్ - పల్లవి హాజరు ప్రారంభించి బోణీ చేశారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి, అతిపెద్ద షోరూం ఓపెన్ చేయాలి అని, దానికి నా పూర్తి సహాయ సహకారాలు వుంటాయని వివేక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్, కిసాన్ పరివార్ కురవి మండల ఇన్చార్జి శివ వర్మ నాయక్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి శాంతి కుమార్, జిల్లా కన్వీనర్ పట్ల మధు, కో - కన్వినర్ సూర్య ప్రకాష్, ఎల్ హెచ్ పిఎస్ నేతలు రాందాస్ నాయక్, కాంగ్రెస్ నేత రాందాస్ నాయక్ బంధు మిత్రుల పాల్గొన్నారు.

# 'వ్యవసాయ' డీలర్లకు దేశీ ధ్రువపత్రాలను పంపిణీ చేసిన

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ వి.పాటిల్.




భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన డీలర్లు తప్పనిసరిగా డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఇన్పుట్ (దేశీ) ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం చుంచుపల్లి మండలం రామవరం రైతు వేదిక నందు ఏడవ బ్యాచ్ దేశీ సభ్యుల ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలో40 మంది వ్యవసాయ, అనుబంధ రంగాల డీలర్లకు దేశీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. వీరందరూ 48 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్నారు.దీనిలో భాగంగా 7వ బ్యాచ్లో జిల్లాలోని 40 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వ్యాపారం చేస్తున్న వారికి దేశీ పేరుతో 12 నెలల డిప్లమో కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయశాఖలో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులు, శాస్త్రవేత్తలతో వారానికి ఒకరోజు చొప్పున (ఆదివారం) 48 వారాల శిక్షణ ఇస్తున్నామన్నారు. వాతావరణ పరిస్థితులు గురించి భూసార పరిరక్షణకు చేపట్టవలసిన చర్యలను, నీటి యాజమాన్యం గురించి సభ్యులకు కలెక్టర్ వివరంగా తెలిపారు. దేశీ సభ్యులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను రైతాంగానికి తెలియపరచి సేంద్రీయ పద్ధతుల ద్వారా పంటలు పండించాలని, ఎప్పుడూ ఒకే పంట మీద ఆధారపడకుండా రైతులకు ఎక్కువ ఆదాయం అందించే మునగ, వెదురు, కూరగాయ పంటలైన టమాట, బెండ మరియు దోశ తదితర పంటలను సేంద్రీయ పదార్థాలైన పచ్చి రొట్టె ఎరువులు, బయో ఫెర్టిలైజర్స్ ( జీవన ఎరువులు) ఎక్కువగా వినియోగించి ప్రజలకు ఆరోగ్యమైన పంటలు అందించి తద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని అన్నారు. రసాయన ఎరువులు తగ్గించే విధంగా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధ్రువపత్రాలు అందుకున్న దేశీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ సభ్యులకు మునగ సాగు మరియు దాని ద్వారా వచ్చే ఆదాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ అగ్రికల్చర్ ఆఫీసర్ డేవిడ్ జయపాల్ దేశి వ్యవసాయ కోర్సు శిక్షకుడు, జి దీపక్ మండల వ్యవసాయ అధికారి జూలూరుపాడు, రాజేశ్వరి మండల వ్యవసాయధికారి చుంచుపల్లి , రంజిత్ టెక్నికల్ అసిస్టెంట్ మరియు డీలర్లు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం!!

### రక్త శిబిరం ప్రారంభించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సందర్భంగా వనపర్తి జిల్లా కేంద్రంలో ఈ నెల 21న అమరవీరులకు ఘనంగా నివాళులర్పించిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తో పాటు జిల్లాలోని పోలీసులు భారీ



ఎత్తున పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఈనెల 22 న జిల్లా ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఎస్పీ రావుల గిరిధర్ నేతృత్వంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు, ఈ కార్యక్రమంలో దేశం కోసం రాష్ట్రం కోసం విధులు బాధ్యతలు నిర్వర్తిస్తున్న సందర్భంలో ప్రజల కోసం ప్రాణాలను అర్పించిన అమరవీరుల పోలీసుల సంస్కరణ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ రక్తదాన శిబిరం



అమరవీరులకు త్యాగం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రకటించారు, విధి నిర్వహణలో ప్రజల కోసం నిరంతరం ప్రజాసేవలో అంకితభావంతోనా పనిచేస్తూ ఉగ్రవాదులు, మావోయిస్టులు పోలీసులను ప్రాణాలను తీసిన దినాన్ని మర్చిపోలేక



పోతున్నామని రాబోయే రోజుల్లో ఇలాంటి దుశ్చర్యను దుర్మార్గ చర్యను పోలీసులు ఖండిస్తూ దెబ్బకు దెబ్బ తీసే రోజులు వచ్చే రోజులు దగ్గర్లో ఉన్నాయని ఆయన వెల్లడించారు, ఈ సందర్భంగా రక్తదాన శిబిరం కార్యక్రమంలో వనపర్తి జిల్లాలోని 14 మండలాలలోని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసులు, సర్కిల్ ఇన్స్పెక్టర్, స్థానిక పోలీసులు, బాధ్యతగా హాజరై రక్తదాన కార్యక్రమంలో పాల్గొనడం కాక వివిధ కళాశాల విద్యార్థులు, రాజకీయ పార్టీల నాయకులు జర్నలిస్టులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని పోలీసుల అంకితభావ కృషిని అభినందించడం




అభినందనీయమని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అన్నారు, వనపర్తి జిల్లాలో పోలీస్ అమరవీల సంస్కరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం పట్ల వనపర్తి జిల్లా ప్రజలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు విద్యార్థులు మేధావులు, కవులు కళాకారు పోలీసులను అభినందించారు, ఈ కార్యక్రమంలో వనపర్తి ఏ ఎస్ పి రాందాస్ తేజావత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ , ఎం ,కృష్ణ టౌన్ ఎస్ఐ హరిచందర్, ఆత్మకూరు సీఐ, శివకుమార్, పెద్దమందడి ఎస్సై యుగంధర్ రెడ్డి,పానగల్ ఎస్సై కొమ్ము శ్రీనివాస్ యాదవ్, మదనపూర్ ఎస్సై, కర్నే శేఖర్ రెడ్డి, తదితర మండలాల్లోని ఎస్ఐలు పోలీసులు భారీ ఎత్తున పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ ఫోకస్ దినపత్రిక గుండె మోని శ్రీనివాస్ యాదవ్, గౌతమ్ న్యూస్ దినపత్రిక రాష్ట్ర నెట్వర్క్ ఇన్చార్జి రవిశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు,

# రక్తదానం అందరికీ ప్రాణదానం

### వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పోలీసు అమర వీరుల త్యాగాలు, చిరస్మరణీయం!!




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): ఆపద సమయంలో మనం చేసే రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుంది వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు, పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలలో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ రక్తదాన శిబిరంలో



జిల్లాలోని పోలీసు అధికారులు, రిజర్వ్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, కొత్తకోట ఎస్సై, మంజునాథ్ రెడ్డి, పెద్దమందడి ఎస్సై యుగంధర్ రెడ్డి, ఆత్మకూరు ఎస్సై,నరేందర్. అమరచింత ఎస్సై, సురేష్, చిన్నంబావి ఎస్సై, రమేష్, జిల్లా ఎస్పీ గారి . పి ఆర్ ఓ, రాజా గౌడ్, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని స్వచ్ఛందంగా 123 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ రావుల గిరిధర్ మాట్లాడుతూ.. సమాజం కోసం,దేశం కోసం,రేపటి తరాల మంచి భవిష్యత్తు కోసం ప్రాణత్యాగాలు చేశారని వారి త్యాగాలను వెలకట్టలేమన్నారు. ప్రతీ ఒక్కరూ పోలీసు అమరవీరుల త్యాగాలను నిత్యం స్మరించుకోవాలన్నారు. వారి త్యాగ ఫలితమే మనమంతా ప్రశాంత జీవితాన్ని గడుపుతున్నామని అన్నారు. పేదప్రజలు,బాధితులకు సత్వర న్యాయం అందించడం,ధర్మం పక్షాన నిలిచి మెరుగైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా పని చేసినప్పుడే వారి త్యాగానికి మనమందించే ఘనమైన నివాళి అని తెలిపారు. అమ్మ జన్మనిస్తే రక్తదానం పునర్జన్మ నిస్తుందని అన్నారు. ఒక్క రక్తదానంతోనే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేయడం సాధ్య మవుతుందన్నారు. థలసేమియా,క్యాన్సర్, హిమోఫీలియా,రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి,ఇతరత్రా జబ్బులతో బాధపడుతున్న వారి కోసం ఎక్కువగా రక్తం అవసరం ఉంటుందని,రక్తదానం చేసి అటువంటి వారి ప్రాణాలను కాపాడటం ద్వారా మనకు కూడా మంచి చేకూరుతుందని అన్నారు. రక్తదానంమహాదానమని,రక్తదానంపై అపోహాలు వద్దని ఎస్పీ గారు అన్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించడానికి ఈ శిబిరాల ద్వారా సేకరించిన రక్తం ఉపయోగపడుతుందని తెలియజేసారు. ఆరోగ్యంగా ఉండే ప్రతి మనిషి ప్రతీ 5 నెలలకొకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరం మరింత ఉత్సాహవంతంగా మారుతుందని అన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరిని ఎస్పీ గారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.రక్తదానం చేసిన రక్త దాతలకు ఎస్పీ గారు ప్రశంషా పత్రం, పండ్లు పంపిణీ చేశారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా 123 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగిందని, సేకరించి రక్తాన్ని




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకుకు అందజేయడం జరిగింది. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన అధికారులకు,సిబ్బందికి, యువకులకు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులకు, విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజా సంఘాల నాయకులకు వనపర్తి జిల్లా,పరిసర ప్రాంతాల ప్రజలకు ఎస్పీ గారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ రాందాస్ తేజవత్, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, వనపర్తి సీఐ, ఎం,క్రిష్ణ , ఆత్మకూరు సిఐ, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, నరేష్ ,రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, వనపర్తి జిల్లా రెడ్ క్రాస్ ప్రధాన కార్యదర్శి, కృష్ణ సాగర్, వైస్ చైర్మన్, సయ్యద్ కలాం పాషా, రెడ్ క్రాస్ కమిటీ సభ్యులు,గోనూరు యాదగిరి, అహ్మద్,శ్యామ్, ప్రభుత్వ ఆసుపత్రి టెక్నికల్ సిబ్బంది,లక్ష్మీపతి, రమేష్, మహమూద్, సంతోష్, లక్ష్మి, రెడ్ క్రాస్ సిబ్బంది, మరియు విద్యార్థులు, మహిళలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, పత్రికా మీడియా మిత్రులు ఎస్పీ పి, ఆర్ ఓ రాజ గౌడ్ జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు,



గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
గురువారం - 24 - అక్టోబర్ - 2024

## ఐఎన్ టి యుసి నాయకుల పోరాట ఫలితమే ఎల్ ఎస్ ఎన్,కార్మికుల సమస్యల పరిష్కారం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): కోయగూడెం ఓపెన్ కాస్ట్ ఎల్ ఎస్ ఎన్ క్యాంపు నందు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐ ఎన్ టి యు సి ఇల్లందు సింగరేణి ఏరియా



సలహాదారులు కోరం సురేందర్ ఎల్ ఎస్ ఎన్ యాజమాన్యంతో కార్మికుల 25 డిమాండ్లను చర్చించి పరిష్కరించడం జరిగింది. కార్మికులందరికీ జీతాలు పెంచడం,వాటర్ ట్యాంకర్ డ్రైవర్లకు వాల్వో డ్రైవర్లకు ఇచ్చే వేతనం ఇవ్వాలని, కంపెనీ బోనస్ వీలైనంత త్వరగా వేయాలని,ప్రతి కార్మికునికి పీఫ్ కట్ చేయాలని, పెండింగ్ పీఫ్ డబ్బులు కార్మికుని ఈపీఎఫ్ అకౌంట్లో జమ చేయాలని, దీపావళి పండుగకు ప్రతి కార్మికునికి 5000/- రూపాయలు అడ్వాన్స్ ఇవ్వాలని, ఇలా మొత్తం 25 సమస్యల పైన %శ్రీంఅ% కంపెనీ జీఎం శివ గారితో, ప్రాజెక్ట్ మేనేజర్ రాజమోహన్ రెడ్డి గారితో తో చర్చలు జరిపి పరిష్కారం చేయుటకు ఒప్పందం కుదిరిచ్చినారు. ఈ ఒప్పంధానికి యాజమాన్యం అంగీకారించింది.కార్మికులందరూ ఆనందోత్సాహంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు కోరం సురేందర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ ముచ్చ సుధాకర్, యూనియన్ సభ్యులు, అంబాలచంద్రమౌళి, బానోత్ సైదులునాయక్, కత్తుల వెంకటేశ్వర్లు, బోడశ్రీకాంత్, గంగారపుసతీష్, బాదావత్ నాగేష్, జాటోత్ సీతారాం పాల్గొన్నారు.

## ఫుట్ పాతులు దాటి వ్యాపారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

ఎంపీడీవో రవీందర్ రావు.




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): టేకులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బోడు ఎక్స్ రోడ్ లో చిన్న సన్నకారు, కిరాణం, టీ మరియు బేకరీ, పండ్ల దుకాణాలు, కూరగాయల వ్యాపారం చేస్తున్న షాప్




యజమానులు అందరు ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంగించి ఆర్ - బి రోడ్డు మార్కింగ్ డ్రైనేజ్ కాలువ దాటీ బహిర్గతంగ వ్యాపారం చేస్తున్న వారి కి బుధవారం టేకులపల్లి మండల ఎంపీడీఓ రవీందర్ రావు ఎంపీవో గణేష్ గాంధీ ఏపీవో శ్రీనివాసు మరియు కార్యదర్శి దీప్తితో కలిసి నోటీసులు ఇచ్చారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇప్పుడు కానీ భవిష్యత్తులో గాని ఫుట్పాత్ దాటి వ్యాపారం చేస్తూ ప్రజలకు మరియు ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే వ్యాపారులపై కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని వారు తెలియజేస్తూ, 24 గంటల్లో మీ తిరును మార్చుకోకపోయిన మరోసారి ఇలా జరిగితే అట్టి షాపులను తొలగించి,చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 50 ఏళ్ల పిడిఎస్ యు పోరాట స్ఫూర్తి సభ ను విజయవంతం చేయండి




టేకులపల్లి (గౌతమ్ న్యూస్): ఈ నెల 25 నా వరంగల్ పట్టణంలో జరుగు పిడిఎస్ యు 50 ఏళ్ళ పోరాట స్ఫూర్తి సభని విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు టేకులపల్లి మండల కేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు ) ఆధ్వర్యంలో విద్యార్థి ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి జె గణేష్ మాట్లాడుతూ. ఈ నెల 12 నాటికి పిడిఎస్ యు ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిందని, ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఉద్భవించిన విప్లవ విద్యార్థి సంస్థ గత 50 ఏళ్లుగా శాస్త్రీయ విద్యాసాధనకై, సమ సమజ స్థాపనే ధ్యేయంగా ఉద్యమిస్తుంది. విద్యా రంగంలో సమస్యల పరిష్కారం కొరకు, విద్యాలయాలలో కనీస మౌలిక వసతుల ఏర్పాటుకై, విద్య వ్యాపారికరణ, కాషాయికరణను వ్యతిరేకిస్తూ అవిరామ పోరాటాలు నిర్వహిస్తుంది. ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో పని చేస్తున్న సంస్థ తొలినాళ్ళలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు లాంటి ఎంతో మంది విద్యార్థులు అమరులయ్యారు. దేశ వ్యాప్తంగా పెరిగిపోతున్న బ్రాహ్మణీయ హిందుత్వ భావజాల పాసింజం కు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంది. ఈ క్రమంలో మరింత ఉత్సాహంతో పనిచేసేందుకు సంస్థ 50 ఏళ్ల చరిత్రను సృచించుకుంటు రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో వరంగల్ పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల నందు అక్టోబర్ 25వ తారీఖున 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభ ని నిర్వహిస్తున్నట్లు ఈ సభను విద్యార్థులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నట్లు మారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు డి .భరత్. డి .అరుణ్. మౌనిక. సంధ్య. కావేరి.తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): విద్యుత్ వినియోగదారులకు మరియు రైతులకు విజ్ఞప్తి ఈ రోజు ఉదయం 9:00 నుండి 1:00 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని . 11 కెవి లైన్స్ నందు పగిలిన మరియు దెబ్బతిన్న ఇన్సులేటర్ల రీప్లేస్మెంట్ పనులు జరుగును విద్యుత్తు ప్రభావిత ప్రాంతాలైన దుబ్బతండా, రాంపురం, పాత తండ, తెలుగురు, ప్రెగళ్లపాడు, మాలపల్లి, కొత్త తండా, తావుర్య తండ, కోక్య తండ, లక్ష్మీపురం, పాతతడికల పూడి, స్టేషన్ తడికలపూడి మధ్య దుబ్బతండా నుండి పాత తడికలపూడి మధ్య విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ దేవ ఒక ప్రకటన లో తెలియ జేశారు.

## డౌలాగర్ జ్ఞానేశ్వరి చిత్రపటానికి నివాళులు అర్పించిన ప్రముఖులు



మానుకోట జిల్లా ప్రతినిధి (గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ మున్సిపల్ 26వ వార్డు కౌన్సిలర్ డౌలాగర్ శంకర్ తల్లి జ్ఞానేశ్వరి ఇటీవల మరణించగా బుధవారం వారి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరై నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ నోముల రవీందర్, డి.ఈ ఉపేందర్, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, జగన్, గోగుల రాజు, మార్నేని రఘు, కర్పూరపు గోపి, ఎస్కే ఖలీల్, అంబాల శివకుమార్, జాటోత్ రంగ్య, నిమ్మల శ్రీనివాస్, కమలాకర్, మార్నేని కిరణ్, వీరెందర్, శ్రీహరి, క్రాంతి తదితరులు హాజరయ్యారు.

# టౌన్ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం




మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): పోలీస్ విది విధానాల, పోలీస్ స్టేషన్ పనితిరు, మరియు ఆయుధాలు, బాంబు స్క్వాడ్ పరికరాల పై ఓపెన్ హౌస్. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలో భాగంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఐపిఎస్



ఆదేశాలతో బుధవారం మహబూబాబాద్ జిల్లా అన్ని పోలీస్ స్టేషన్లలో అమరవీరులను స్మరించుకుంటూ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం లాంఛనంగా నిర్వహించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రంనాథ్ కేకన్ హాజరయ్యారు. మహబూబాబాద్ టౌన్ పరిధిలో ఉన్న ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు




పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 500 మంది ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్మడ్ ఫోర్స్ నుండి వచ్చిన అధికారులు సిబ్బంది స్వయంగా పిల్లలకు ఆయుధాల గురించి, పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి వివరించారు. పోలీసులు ఉపయోగిస్తున్న ఆయుధాల గురించి, ఏకే 47, ఎస్ఎల్ఆర్, కార్బన్, 9ఎమ్.ఎమ్ పిస్టల్, బీడీ టీమ్, ఫింగర్ ప్రింట్, క్లూస్ టీమ్, షీటీమ్, భరోసా, కమాండ్ కంట్రోల్ రూమ్ సీసీ కెమెరాలు, రోడ్డు ప్రమాదాలు స్పీడ్ లేజర్ గన్, ట్రాఫిక్ రూల్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, డాగ్ స్క్వాడ్స్, సైబర్ క్రైమ్ తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సిబ్బంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు మరియు ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని మరియు రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి



విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు విద్యార్థినీ విద్యార్థులు స్వయంగా ఆయుధాల గురించి తదితర అంశాల గురించి వాటి పేర్లు అడిగి తెలుసుకున్నారు. బాలికలు మహిళల రక్షణకు ఏర్పాటుచేసిన భరోసా కేంద్రం యొక్క సేవల గురించి అవగాహన కల్పించడం జరిగింది. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది.

# సింగరేణి ఉమెన్స్ జూనియర్ కాలేజీలో నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులను తిరిగి చెల్లించండి

### తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోట శివశంకర్ డిమాండ్.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి ఉమెన్స్ జూనియర్ కాలేజీలో నేరుగా విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫీజుని మొదటి సంవత్సరం సుమారు ?7,000 సెకండ్ ఇయర్ సుమారు ?7,000 ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఒకటే సారీ మొదలు అవగానే బ్యాంకులో నేరుగా విద్యార్థులు కట్టి బ్యాంకు చలానా రిసిప్ట్ కాలేజీలో తల్లితండ్రులు అందజేస్తారు వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2008 సంవత్సరంలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకం మంజూరు చేసినప్పటి నుంచి స్కాలర్షిప్ విద్యార్థుల అకౌంట్ లోకి నేరుగా వెళుతుంది ట్యూషన్ ఫీజు మాత్రం ప్రిన్సిపాల్ అకౌంట్లోకి వెళుతుంది 2008 నుంచి జిఎం రామ్ నారాయణ ఉన్నంతవరకు ప్రిన్సిపాల్ ఎకౌంట్లో నేరుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు ప్రిన్సిపాల్ అకౌంట్లో జమ చేయడం జరిగింది ప్రిన్సిపాల్ అకౌంట్లో పడిన ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు వాటి లెక్క పత్రాలపై పూర్తి విచారణ జరిపించాలి జీఎం రామనారాయణ రిటైర్ అయ్యే ఆరు నెలల ముందు మా తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం ఆధ్వర్యంలో నేషనల్ ఎస్సీ కమిషన్ లో సింగరేణి ఉమెన్స్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో అక్రమంగా విద్యార్థుల దగ్గర్నుంచి నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థుల దగ్గర్నుంచి అక్రమంగా ఫీజులు



వసూలు చేస్తున్నారని అందిన ఫిర్యాదు విచారణలో భాగంగా సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కాలేజీ తో పాటు సింగరేణి ఉమెన్స్ జూనియర్ కాలేజీలో అవినీతి జరిగిందని జిఎం రామ్ నారాయణ గారు పసిగట్టడం జరిగింది అప్పటి ప్రిన్సిపాల్ సుమారు 36 లక్షల రూపాయలు వ్యక్తిగతంగా ప్రిన్సిపాల్ అకౌంట్లో నుంచి డ్రా చేసుకొని పర్సనల్గా వాడుకున్నారని కూడా విచారణలో తేలింది అవినీతి చేసిన డబ్బులను జిఎం రామ్ నారాయణ చాలా సీరియస్ గా తిరిగి ప్రిన్సిపాల్ తో వెనక్కి కట్టించడం కూడా జరిగింది అప్పటినుంచి జిఎం రామ్ నారాయణ చాలా పకడ్బందీగా చాలా సీరియస్ గా అన్ని అకౌంట్లను రద్దుచేసి ప్రిన్సిపాల్ ల పేరుతో ఒక్క ఎకౌంటు కూడా ఉండకూడదు అని ఆదేశాలు జారీ చేయడం జరిగింది ప్రతి కాలేజీ ప్రిన్సిపాల్ మరియు జిఎం ఎడ్యుకేషన్ పేరు మీద జాయింట్ అకౌంట్ పెట్టడం జరిగింది. ఆ జాయింట్ అకౌంట్ లో పడిన ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులను తిరిగి విద్యార్థులకు ఇవ్వాలి 2008 నుంచి ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ మంజూరు చేస్తుంది నేరుగా 2008 నుంచి ప్రిన్సిపాల్ ఎకౌంట్లో ట్యూషన్ ఫీజు జామ అయింది జూనియర్ కాలేజీ విద్యార్థులు ముందుగానే ట్యూషన్ ఫీజు కూడా కాలేజీకి ఫీజు కట్టివేశారు కాబట్టి ప్రతి సంవత్సరం మొదటి సంవత్సరం కాలేజీ ఫీజు మొత్తం ఒకటే సారి విద్యార్థులు నేరుగా బ్యాంకులో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కి చెల్లించారు రెండో సంవత్సరం కూడా నేరుగా బ్యాంకులో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కి చెల్లించారు కాబట్టి ప్రభుత్వం మంజూరు చేసిన స్కాలర్షిప్ విద్యార్థి అకౌంట్లో జమవుతుంది ప్రభుత్వం మంజూరు చేసిన ట్యూషన్ ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు జిఎం ఎడ్యుకేషన్ మరియు ప్రిన్సిపాల్ జాయింట్ అకౌంట్ లో జమ అవుతుంది 2008 నుంచి ఇప్పటివరకు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అకౌంట్లో ఎంత డబ్బులు జమ అయ్యాయి తిరిగి ఏయే విద్యార్థులకు ఇచ్చారు ఒకవేళ ఇవ్వకపోతే ఎందుకు ఇవ్వలేదు ఇప్పుడు ఆ డబ్బులు అన్ని ఎవరి దగ్గర ఉన్నాయి వీటిపై మొత్తం పూర్తి సమగ్రమైన విచారణ నిర్వహించి నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు తిరిగి ఆ ట్యూషన్ ఫీజు డబ్బులను వెనక్కి ఇవ్వాలి దీనిపై పేద విద్యార్థులకు న్యాయం చేయాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ ఆధ్వర్యంలో సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రెటరీ డివైజియం గుండా శ్రీనివాస్ రావు ని మరియు కరస్పాండెంట్ సునీల్ కుమార్ ని కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది దీనిపై పూర్తి సమగ్రమైన విచారణ నిర్వహించి పేద విద్యార్థులకు న్యాయం చేయగలరు లేకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు.

## హైదరాబాద్ లో సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు

### ప్రారంభ ఉపన్యాసం చేసిన గుర్తింపు సంఘం ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కె. రాజ్ కుమార్.

భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): హైదరాబాద్ : సింగరేణి లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు సింగరేణి యాజమాన్యం మరియు ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్లో అక్టోబర్ 23 నుంచి 26 వరకు శిక్షణ తరగతులు బుధవారం నుంచి ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమాల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ప్రారంభోపన్యాసం ఇవ్వగా, ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ , గుర్తింపు మరియు ప్రాతినిధ్య సంఘం నాయకులు కె. సారయ్య, వై.వి. రావు,వంగ వెంకట్, ఎస్వి. రమణమూర్తి, వి. మల్లికార్జున్, ఎండి.రజాక్, ఎల్.ప్రకాశ్, మడ్డి ఎల్లా గౌడ్, కూసన వీరభద్రం, ఆరెల్లి పోషం, జీగురు రవిందర్, ఎం.రాంచంద్రారెడ్డి, భాజీసైదా, తో పాటు తదితరులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఇట్టి ప్రత్యేక




శిక్షణా కార్యక్రమాల్లో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఇండియా వారి మైనింగ్ డివిజన్ కు సంబంధించిన విధివిధానాలు, సింగరేణి లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు యాజమాన్యం తో ఎలా వ్యవహరించాలో తదితర అంశాల పై నాయకులకు తర్ఫీదు నిస్తారు. ఇంకా ఈ కార్యక్రమంలో సింగరేణి కార్పొరేట్ జనరల్ మేనేజర్ (పర్సనల్ ,ఐఆర్ అండ్ పిఎం) కవిత నాయుడు, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా కు చెందిన లెక్చరర్ లు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ పిల్లలలో రక్తహీనతను గుర్తించి నాణ్యమైన వైద్యం చేయాలి

### సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డేబోయిన శ్రీనివాస్



మానుకోట జిల్లా ప్రతినిది(గౌతమ్ న్యూస్): కట్టెల మండే అంగన్వాడి సెంటర్ నందు నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమమును పరిశీలించి, ఈ సందర్భంగా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలలో రక్తహీనతను గుర్తించి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రాలను ఇవ్వాలని, అలాగే గర్భిణీ స్త్రీలను పరీక్షించి ఎనిమిక్ అంటే రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలని, అలాగే వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చేటప్పుడు ఏ ఏ జబ్బులకు ఈ టీకాలను ఇస్తున్నాము తల్లి తండ్రులకు తెలియజేయాలి. అలాగే మరల ఎప్పుడు టీకా డ్యూ ఉన్నదో తెలియపరచి ఆ తేదీని రాసి ఇవ్వాలని, అలాగే డ్రైడేను పరిశీలించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అంగన్వాడీ టీచర్ను మరియు ఆయాను, అలాగే పిల్లలు వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భవిత, లలిత, అంగన్వాడీ టీచర్ మాధవి, మరియు ఆశలు సరిత, పుష్ప, అంగన్వాడి ఆయా తదితరులు పాల్గొన్నారు.

## టేకులపల్లి లో చాప పిల్లల పంపిణీ. ఆందోళన వ్యక్తం చేస్తున్న మత్స్యకారులు



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): రైతు వ్యవసాయం చేసేందుకు భూమిలో పదును, అదును ఉండాలనేది అందరికీ తెలిసిందే. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మత్స్య శాఖ తీరు దానికి విరుద్ధంగా ఉంది. టేకులపల్లి మండలంలో బుధవారం మత్స్య శాఖ ఆధ్వర్యంలో చేపల సొసైటీలకు చేపపిల్లలు పంపిణీ చేశారు. ఆగష్టు నెలలో ఇవ్వాల్సిన చేపపిల్లలు అక్టోబర్ నెలలో ఇస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిస్తే ఎదుగుదల ఉండదని, వాటికి వేసే మేత కూడా ఇప్పటికే చెరువులో ఉండే పెద్ద చేపలు తిని, పిల్లలకు ఆహారం అందదని అంటున్నారు. ఆ శాఖ అధికారులు మాత్రం పిల్లలు సరఫరా చేసే గుత్తేదారు చేసిన ఆలస్యంతోనే రైతులకు సకాలంలో ఇవ్వలేక పోయామని అంటున్నారు. తీసుకొచ్చిన చేప పిల్లలు ఉదయాన్నే ఇవ్వాల్సి ఉండగా, సాయంత్రం వరకు ఇవ్వకుండా వాహనంలోనే మండుటెండలో ఉంచడం విశేషం. హడావిడిగా పంపిణీ చేయడంపై రైతులు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల తర్వాత పంపిణీ చేయడం వలన ఉపయోగం లేదని అంటున్నారు. పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీఓ రవీందర్ రావు, ఎంపీఓ గణేష్ గాంధీ, మత్స్య శాఖ ఏడీఏ మహ్మద్ ఇంతియాజ్ ఖాన్, సిబ్బంది ఇంతియాజ్, కోటేశ్వర్ రావు, అనిల్, సొసైటీ చైర్మన్, రైతులు పాల్గొన్నారు.

# మరణించిన పోలీసు కుటుంబాలకు భరోసా!!

### పోలీస్ కుటుంబానికి భద్రత చెక్కుల అందజేసిన వనపర్తి జిల్లా ఎస్పీ

### చనిపోయిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో (గౌతమ్ న్యూస్): పోలీస్ భద్రత పథకం ద్వారా పోలీస్ కుటుంబాలలో కొత్త వెలుగులు నింపుతూ, ఆర్థిక భరోసా కల్పిస్తుందని వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్



అన్నారు.బుధవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన సివిల్ కానిస్టేబుల్ ఉమ్మాల బాలరాజు పోలీస్ కానిస్టేబుల్ నెంబర్ 3195 కుటుంబానికి పోలీస్ భద్రత నుండి మంజూరైన 15,95,800/- చెక్కును, బాలరాజు భార్య మంజుల, పిల్లలకు, వారి టుంబసభ్యులకు కలిసి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ భద్రత చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చనిపోయిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ది సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని ఆయన చెప్పారు. అదే విధంగా భద్రత స్కీమ్ ద్వారా చనిపోయిన పోలీస్ కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమములో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, బిసిఆర్బి ఎస్సై, సెక్షన్ సూపర్డెంట్, రాజవర్ధన్ తదితరులు ఉన్నారు,

# ప్రభుత్వ పాఠశాలలో పాము కలకలం



(గౌతమ్ న్యూస్): రాయపర్తి మండలం సన్నూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పాము గత కొన్ని రోజులుగా స్కూల్లోనే తిరుగుతూ భయందోళననికి గురిచేసింది, స్టాఫ్ రూంలో దూరిన పామును గుర్తించిన ఉపాధ్యాయులు స్థానికంగా ఉన్న పాములను పట్టే వాళ్ళకి సమాచారం ఇవ్వగా వాళ్ళు పామును పట్టి తీసుకెళ్ళిపోయారు, ఇలాంటి సంఘటనలు గత కొన్ని నెలలుగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతుండడంతో ప్రభుత్వం నిర్లక్షం చెయ్యకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు

# గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం పై అవగాహన కల్పించిన బరోడా బ్యాంక్ అధికారులు

### కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలుసురక్షితం మాజీ సర్పంచ్ గూగులోత్ నగేష్ .



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సుజాతనగర్ మండలంలో గల 2 ఇంక్లైన్ గ్రామపంచాయతీలో, ఈరోజు గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు బ్యాంక్ ఆఫ్ బరోడా అధికారులు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ గ్రామాన ఈ యొక్క కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలు ఎలా పనిచేస్తాయో, గ్రామ ప్రజలకు వివరించారు. ఫీల్డ్ ఆఫీసర్ బానోత్ రవీందర్, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అద్భుతమైన బీమా పథకాలు అని ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎం ఎస్బివై ) ఈ పథకం కింద రెండు లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని దీనికి కేవలం ఒక సంవత్సరానికి 20 రూపాయలు (18 నుండి 70 )సంవత్సరాల వయసు గలవారు చెల్లిస్తే సరిపోతుంది అని, ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎం జె జె బి వై) ఈ పథకం కింద రెండు లక్షల రూపాయల బీమా వర్తిస్తుందని అలాగే దీనికిగాను 436 రూపాయలు పాలసీదారులు వార్షికంగా చెల్లిస్తే సరిపోతుంది. వయసు (18 నుండి 50) సంవత్సరాలు గా నిర్ణయించబడింది. గ్రామ ప్రజలు ఈ అమూల్యమైన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని . ఇటువంటి పథకాలు ప్రవేశపెట్టినందుకు స్థానిక ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ బీమా పథకం దారిద్ర రేఖకు దిగువన ఉన్న సామాన్య, బీద, మధ్యతరగతి ప్రజలు,ప్రతి ఒక్కరు, వారి యొక్క వయసుకు అనుగుణంగా పాలసీని ఎంచుకోవాల్సిందిగా బ్యాంక్ అఫ్ బరోడా అధికారి ఫీల్డ్ ఆఫీసర్ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో బరోడా బ్యాంక్ సిబ్బంది రోహిత్, రాజు, వీరితోపాటు టూ ఇంక్లైన్ పంచాయితీ మాజీ సర్పంచ్ గుగులోతు నగేష్, మాజీ ఉపసర్పంచ్ సింగిరాల రమేష్, గరీబ్ పేట మాజీ సర్పంచ్ మాలోత్ రాములు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రక్త సంబంధాన్ని తెంచేసిన భూ తగాదా

### అన్నను హత్య చేసిన తమ్ముళ్లు అరెస్ట్



మెట్ పల్లి (గౌతమ్ న్యూస్): మల్లాపూర్ మండలం ఓబులాపూర్ లో ఈ నెల 20న జరిగిన పల్లపు సాయిలు (36) అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులను పట్టుకున్నట్లు మెట్ పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలోని విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...మృతుని తమ్ముళ్లయిన పల్లపు చందు, పల్లపు చిన్ని, గొల్ల సోమయ్య అనే వారితో మృతుడు పల్లెపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ వివాదం, ఇంటి స్థలంలో కొన్ని సంవత్సరాల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒకరినొకరు కొట్టుకొని మల్లాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసులు కూడా నమోదు అయ్యాయి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ కూడా పెట్టారు. సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసిన గొల్ల సోమయ్య, చందు, చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. అనంతరం గొడవపడి సాయిలుని నెట్టివేయగా కింద పడిపోయాడు. దాంతో వారి వెంట తెచ్చుకున్న కత్తితో నరకడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వార్ (కత్తి) స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో సీఐ నిరంజన్ రెడ్డి, మెట్ పల్లి ఎస్ఐ లు చిరంజీవి, రాజు, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్యవివాహాలపై గ్రామస్థులలో పోలీస్ కళాబృందం



మానుకోట జిల్లా ప్రతినిధి(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో మహ బూబాబాద్ మండలం లక్ష్మీపురం గ్రామంలో మూఢనమ్మకాలు, గుట్కా, బాల్యవి వాహాలపై పోలీస్ కళాబృందం గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దీపిక మాట్లాడుతూ గ్రామాలలో మూఢనమ్మకాలు విడి, ప్రపంచం వెళు _న్న ధోరణికి సరి సమానంగా ఆలోచనలు చేసి అందరూ కలిసికట్టుగా జీవించాలి. ముఖ్యంగా గ్రామాలలో బాల్య వివాహాలు ఇంకా జరుగుతూనే వాటిని అరికట్టి, బాల్య వివాహాలు జరిగితే చిన్నతనంలోనే పిల్లలు పుట్టి మహిళలు ఇబ్బందులు పడుతుంటారు కావున మీ వివాహాలని అరికట్టి 18 సంవత్సరాలు వచ్చే వరకు పెళ్లి చేసుకోకూడదు. గుట్కా, పాన్, జరదా వంటి వాటికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోకండి. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సిఐ సర్వయ్య, ఎస్ఐ దీపిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి నేడు బషీరాబాద్,యాలాల్ మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.

### మైల్వార్ గ్రామంలో బస్ షెల్టర్ కు శంకుస్థాపన.

### హాజీపూర్ గ్రామంలో కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం.



తాండూర్ (గౌతమ్ న్యూస్): నియోజకవర్గం పరిధిలోని మైల్వార్ గ్రామంలో బస్ షెల్టర్ శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ..



కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన బషీరాబాద్ మండలంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ఎన్నికల సమయంలో మైల్వార్ గ్రామానికి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు శంకుస్థాపన చేయడం జరుగుతుందని, అలాగే గ్రామంలో ప్రధాన సమస్యలు అయిన డ్రైనేజీ, రోడ్ల ఏర్పాటుకు త్వరలో నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరిగిందని అన్నారు. అలాగే మైల్వార్ గ్రామానికి ప్రధాన చెరువు అయిన అక్కలమ్మ చెరువును గత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వెంటనే తాత్కాలికంగా మరమ్మతులు చేయించడం జరిగిందని, త్వరలోనే అక్కలమ్మ చెరువు సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. వానాకాలంకు సంబంధించిన వడ్ల కొనుగోలు కేంద్రాలు త్వరలోనే ప్రారంభిస్తామని, ఈసారి ప్రత్యేకంగా సన్న రకం, దొడ్డు రకం వడ్లకు ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం యాలాల్ మండలం హాజీపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కృషి ఫలితంగానే పార్టీ అధికారంలోకి వచ్చిందని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, గ్రామాలలో ఇందిరమ్మ కమిటీల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసి తప్పుడు జీవోలు ఇచ్చిందని, ఆ పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారని, ప్రస్తుతం మన ప్రభుత్వంలో అలా కాకుండా ఆర్థిక శాఖ ఆమోదంతో పరిపాలనా పరమైన అనుమతులతో నియోజకవర్గానికి సుమారు 230 కోట్ల రూపాయలు రహదారుల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మంజూరు చేయడం జరిగిందని, అదే విధంగా త్వరలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు ఇస్తామని అన్నారు..

### కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కాంగ్రెస్ పార్టీ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో హాజిపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తో పాటు సుమారు 100 మంది బి ఆర్ ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ కలిసి కట్టుగా పని చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు ఘనంగా నిర్వహణ ..

### విధి నిర్వహణలో అంకితభావంతో పోలీస్ డ్యూటీ..

### మరిపెడ సీఐ రాజకుమార్.

### పోలీసు అమరుల వారోత్సవాల సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ

మరిపెడ, (గౌతమ్ న్యూస్): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సంరక్షణ కోసం అహర్నిశలు పాటుపడుతున్న పోలీసుల త్యాగాలు వెలకట్టలేని అని మరిపెడ సీఐ రాజకుమార్





అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా బుధవారం సాయంత్రం మరిపెడ ఎస్హెచ్ఓ బోలగాని సతీష్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి కార్గిల్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడారు. దేశ రక్షణలో, దేశ అంతర్గత భద్రత విషయంలో పోలీసుల పాత్ర కీలకమైందని అన్నారు. ప్రజలను సమాజాన్ని సుమార్గంలో నడిపించేందుకు రాజ్యాంగం పోలీసులకు తండ్రి పాత్ర ఇచ్చిందని, లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తారన్నారు. ప్రజలను దుష్ట వ్యక్తుల నుంచి కాపాడేందుకు పోలీసులు తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తారని, శాంతిభద్రల పరిరక్షణ కోసం పోలీసు చివరి క్షణం వరకు డ్యూటీ నిర్వహిస్తారన్నారు. గతంలో ఎందరో పోలీస్ అమరులు ప్రజల సంరక్షణ కోసం, అసాంఘిక శక్తులతో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి మరిపెడ పట్టణ వాసులు, పలు శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు సంఘీభావం తెలుపుతూ ర్యాలీలో కొవ్వొత్తుల నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మరిపెడ అదనపు ఎస్ఐ గంద్ర సంతోష్, సీరోల్ ఎస్ఐ నగేష్, చిన్నగూడూర్ ఎస్ఐ ఝాన్సి, పీఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్ గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజొద్దీన్, కాంగ్రెస్ మండల నాయకులు షేక్ అఫ్జల్, బొడ్డు వెంకన్న, మాలోతు బీకు, ప్రమోద్, బయ్య లింగయ్య, షేక్ పాషా, మేఘనాథ్, పరశరములు, అలువాల శీను, అనంతగిరి రవి, గడ్డం మాల్సూర్, వెంకన్న, బల్లెం రవి, పొలిస్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనర్జీ డ్రింక్ అందిస్తున్న భూక్యా కాశి రామ్ నాయక్

### మండల కేంద్రంలో నాయక్ ల మజాకా...

### ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా ఎనర్జీ డ్రింక్ అందజేసిన

### ఎస్టీ సెల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, శివకాశి సేవ యువ సైన్యం వ్యవస్థాపకులు భూక్య కాశీరాం నాయక్.



డోర్నకల్ (గౌతమ్ న్యూస్): పజా సేవే ప్రజల లక్ష్యంగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమంలో ముందుకు దూసుకుపోతున్న యువ నాయకులు శివకాశి సేవయువ



సైన్యం వ్యవస్థాపకులు, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు యువ నాయకులు భూక్య కాశిరం నాయక్. డోర్నకల్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, తాసిల్దార్, ఎంపీడీవో ప్రభుత్వ కార్యాలయంలో శివకాశి సేవ యువ సైన్యం వ్యవస్థాపకులు భూక్యా కాశిరాం నాయక్ ఆధ్వర్యంలో ఉచితంగా నేచురల్ ఫ్రూట్స్ జ్యూస్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సీజనల్ వ్యాధులు ఎక్కువగా రావడంతో ప్రజలకు ఎనర్జీ ఉండడం కోసం తన సొంత ఖర్చులతో నేచురల్ ఫ్రూట్స్ జ్యూస్ ని ఉచితంగా అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రజల క్షేమం కొరకు పల్లెల్లో నా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని, గత మూడు సంవత్సరాల నుండి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు ఎన్నో చేస్తున్నామని భూక్యా కాశీరం నాయక్ అన్నారు. ఈ సందర్భంగా నాయక్ లు ... సీఐ భూక్యా రాజేష్ నాయక్, ఎంపీడీవో ధరావత్ శ్రీనివాస్ రావు నాయక్, డిప్యూటీ తాసిల్దార్ జర్పుల వీరన్న నాయక్ లు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎనర్జీ డ్రింక్స్ ఉచితంగా అందజేసిన భూక్య కాశీరాం నాయక్ ను అభినందించారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో జరపాలని



వాళ్లు కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్, తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది లు, శివకాశి సేవ యువ సైన్యం సభ్యులు భూక్య రవికుమార్ నాయక్, గూగులోత్ సందీప్, భూక్యా సుమన్, భూక్య రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణం చేయొద్దు : ఆర్టీసీ ఎండి సజ్జనార్



హైదరాబాద్(గౌతమ్ న్యూస్): విద్యార్థులు ప్రమాదకరంగా ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తున్నారు.ఆర్టీసీ బస్సులు సరిపడ లేకపోవడం వల్లే ప్రమాదకరంగా ప్రయాణం చేయవలసి వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన ఆర్టీసీ ఎండి సజ్జనార్ రాష్ట్రంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉంటుందని.. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పు డు బస్సులను అందు బాటులో ఉంచుతున్నారని తెలిపారు. అయినా కొన్ని రూట్లలో విద్యార్థుల రద్దీ వీపరీతంగా ఉంటున్న విషయం సంస్థ దృష్టికి వచ్చిందని తెలిపా రు.కాగా, టీజీఎస్ఆర్టీసీకి చెందిన ఒక బస్సులో కొందరు విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తోన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యియి.. ఈ విషయం ఆర్టీసీ యాజమాన్యందృష్టికి వచ్చిందని తెలిపారు.రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించిందని.. ఆ దిశగా చర్యలు కూడా తీసుకోవడం జరుగుతోంద ని తెలిపారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేం దుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కట్టుబడి ఉందని వెల్లడించారు. తమ వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకొని ఫుట్ బోర్డు ప్రయాణం సురక్షితం కాదన్నారు.

## బదిలీపై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ కు పోలీసు అధికారుల ఘన సన్మానం



నర్సంపేట(గౌతమ్ న్యూస్): నర్సంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న గొర్రె పున్నంచందర్ హన్మకొండ ట్రాఫిక్ విభాగానికి బదిలీ అయ్యారు. కాగా బదిలీపై వెలుతున్న పున్నంచందర్ ను నర్సంపేట సిఐ రమణమూర్తి ఎస్ ఐలు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ రమణమూర్తి మాట్లాడుతూ నర్సంపేట పోలీస్ స్టేషన్ లో విధులను చక్కగా నిర్వర్తించి హనుమకొండ ట్రాఫిక్ విభాగానికి వెళ్తున్నందుకు అభినందనీయమన్నారు. హెడ్ కానిస్టేబుల్ గా సక్రమంగా క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరితో చనువుగా ఉండడం అందరి అభిమానాన్ని పొందడం సంతోషకరమన్నారు. ప్రతి ఉద్యోగికి బదిలీలు తప్పవని ఎక్కడ విధులు నిర్వర్తించిన క్రమశిక్షణతో ప్రజల రక్షణ కోసం పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ ఐ గూడ రవికుమార్ , రూరల్ ఎస్ ఐ అరుణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# హెచ్‌సీఏ వివాదాలపై సుప్రీంకోర్టులో విచారణ





న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఇవాళ (బుధవారం) విచారణ జరిగింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక బెంచ్ వాదనలు విన్నది. ఈ కేసు తదుపరి విచారణను రేపు (గురువారం) మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేస్తూ బెంచ్ నిర్ణయించింది. కాగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఎలక్ట్రోరల్ జాబితా తయారీ, ఎన్నికల నిర్వహణ కోసం గతంలో జస్టిస్ ఎల్ నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. హెచ్‌సీఏకి ఎన్నికలు నిర్వహించడమే కాకుండా.. నిర్వహణపై సిఫార్సులు చేయాలని జస్టిస్ ఎల్ నాగేశ్వరరావుకు సూచించింది. అయితే హెచ్‌సీఏ సభ్యుల్లో ఎక్కువ మంది కుటుంబ సభ్యులేనని ఆయన చేసిన సిఫార్సుపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారు. వారి పిటిషన్లపైనే ప్రస్తుతం కోర్టులో విచారణ జరుగుతోంది. కాగా హెచ్‌సీఏలో కుటుంబ సభ్యులే ఎక్కువ మంది మెంబర్లుగా ఉన్నారని సుప్రీంకోర్టు దృష్టికి జస్టిస్ నాగేశ్వరరావు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉండడంతో హెచ్‌సీఏ ఎన్నికల నిర్వహణలో పలు అంశాలు ప్రభావితం అవుతున్నాయని ఆయన చెప్పారు. అయితే మెంబర్లు మాత్రం ఈ వాదనను వ్యతిరేకిస్తున్నారు.

## మీ నుంచి మేము కోరుకునేది అదే
## రష్యా, చైనా సమక్షంలో తేల్చి చెప్పిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్నారు. ప్రతిష్ఠాత్మకమైన బ్రిక్స్ అత్యున్నత సమావేశంలో పాల్గొనడానికి మంగళవారం ఉదయమే ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. మధ్యాహ్నానికి కజాన్‌కు చేరుకున్నారు. బ్రిక్స్ సమ్మిట్‌కు ఆతిథ్యాన్ని ఇస్తోంది ఈ నగరమే. బెల్జియం, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలకు బ్రిక్స్‌లో సభ్యత్వం ఉంది. ఆయా దేశాల పేర్లల్లో తొలి అక్షరాన్ని తీసుకుని దీనికి ఈ పేరు పెట్టారు. ఇరాన్, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇథియోపియా, టర్కీ దేశాలు ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్నాయి. ఈ సారి ఈ సమావేశానికి రష్యా వేదిక. ఇది 16వ సమ్మిట్. బ్రిక్స్ ప్లీనరీ కొద్దిసేపటి కిందటే ఆరంభమైంది. ప్రధాని మోదీ, రష్యా, చైనా అధినేతలు వ్లాదిమిర్ పుతిన్, గి జిన్‌పింగ్ సహా ఆయా దేశాల అధ్యక్షులు, ప్రధానమంత్రులు ఇందులో పాల్గొన్నారు. పుతిన్ ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం జిన్‌పింగ్ మాట్లాడారు. లెబనాన్, గాజాలపై ఇజ్రాయెల్ సాగిస్తోన్న యుద్ధంపై మాట్లాడారు. కాల్పులు విరమణను ప్రకటించాలంటూ విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రధాని మోదీ మాట్లాడారు. హిందీలో ప్రసంగించారు. రష్యా- ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధం గురించి ప్రస్తావించారు. భారత్ శాంతిని మాత్రమే కోరుకుంటోందని తేల్చి చెప్పారు. కొన్ని దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడటం ప్రపంచ శాంతికి శ్రేయస్కరం కాదని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధ వాతావరణం, ఉద్రిక్తతలను తాము కోరుకోబోమని, ఎలాంటి సమస్యలనైనా శాంతియుతంగా చర్చించుకోవడం ద్వారా పరిష్కరించుకోవచ్చనీ పునరుద్ఘాటించారు. శాంతియుత చర్చలకు భారత్ ఎప్పుడూ ముందు ఉంటుందని, వాటికే తమ మద్దతు ఇస్తామనీ స్పష్టం చేశారు. యుద్ధాల వల్ల ఆయా దేశాలు ఆర్థికంగా ఎంతగానో నష్టపోతాయని, వాటి దుష్ప్రభావం ప్రపంచవ్యాప్తంగా పడుతుందని మోదీ పేర్కొన్నారు. బ్రిక్స్ అనేది విభజనను ఎప్పటికీ కోరుకోదని, ఐకమత్యానికి, ఏకత్వానికీ మద్దతు ఇస్తుందనే సందేశాన్ని ఈ సమ్మిట్ ద్వారా ప్రపంచ దేశాలకు చాటి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉగ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక సహకారాన్ని అందించే దేశాల వైఖరిని మోదీ తప్పు పట్టారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనడానికి బ్రిక్స్ సభ్య దేశాల మధ్య సహకారం అవసరమని చెప్పారు. ప్రపంచానికి పెను సవాల్ విసురుతున్న ఉగ్రవాద నిర్మూలన విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు లేదని కుండబద్దలు కొట్టారు. సైబర్ సెక్యూరిటీ అంశాన్నీ మోదీ ప్రస్తావించారు. సురక్షితమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం కొత్తగా కొన్ని మార్గదర్శకాలను ప్రపంచ దేశాలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొత్త భాగస్వామ్య దేశాలను బ్రిక్స్‌లో చేర్చుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.

## 5వ సారి ఏ నెగిటివ్ రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ మాడిశెట్టి తిరుపతి




హన్మకొండ (గౌతమ్ న్యూస్): మల్కపేట్ గ్రామం , ఆత్మకూరు మండలం , హనుమకొండ జిల్లాకు చెందిన మాడిశెట్టి కోమనీల - రాజులు దంపతుల కుమారుడు హనుమకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో విధులు నిర్వహిస్తున్న వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ " మాడిశెట్టి తిరుపతి " ప్రతిమ రిలీఫ్ హాస్పిటల్ ఆరేపల్లి హనుమకొండ లో చికిత్స పొందుతున్న లక్మి నర్సయ్య కు అత్యవసరంగా ఏ నెగిటివ్ రక్తం అవసరం ఉండగా , ఏ నెగిటివ్ రక్తం దొరకక ఇబ్బంది పడుతూన్న కుటుంబ సభ్యులు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నెరాజు ( స్విమ్మర్ రాజు ) ను సంప్రదించగా , వెంటనే ఏ నెగిటివ్ రక్తదాత వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ " మాడిశెట్టి తిరుపతి " కు సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి , తెలంగాణ బ్లడ్ సెంటర్ హనుమకొండ కు వెళ్ళి 05వ సారి రక్తదానం చేయడం జరిగింది. రక్తదానం చేసిన పోలీస్ కానిస్టేబుల్ " మాడిశెట్టి తిరుపతి " ను పోలీసు ఉన్నతాధికారులు ఆర్.ఐ శ్రీనివాస్ , ఆర్.ఎస్సై రమేష్ , కిరణ్ , వేణు , మహేందర్ యాదవ్ , సుదర్శన్ , రాంబాబు , బ్లడ్ డోనర్ , బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , తూనం రాము , బిటుకూరి యాకయ్య లు అభినందించారు.

## బేకరీ ఐటమ్స్ ఆరోగ్యానికి మంచివి కావు
### జంక్ ఫుడ్ వాడడం వలన దుష్ఫలితాలు
### బేకరీ షాపులలో క్రాకర్స్




నర్సంపేట (గౌతమ్ న్యూస్): నర్సంపేట పట్టణంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న బేకరీ షాపుల పట్ల యువత ఆసక్తి ఎక్కువగా ఉండడంతో బేకరీ షాపులు భారీ సంఖ్యలో వెలుస్తున్నాయి. జంక్ ఫుడ్ కు అలవాటైతే




ఆరోగ్య సమస్యలు ఎక్కువగా వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ యువతలో మార్పు రాకపోగా బేకరి ఐటమ్స్ కి ఎక్కువగా అకర్షితులవువుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువగా మైదాపిండి తో తయారు అయినవి కావడం వలన ఆరోగ్యం పై తీవ్ర ప్రభ చూపడమే గాక భవిష్యత్తులో అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని తెలిసి కూడా బేకరి ఫుడ్స్ పై మక్కువ పెంచుకుంటున్నారు. ఇది మంచి పద్ధతి కాదని వైద్యులు హెచ్చరిస్తున్నప్పటికీ , బేకరీ ఐటమ్స్ పై మక్కువ పెంచుకోవడం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు. నర్సంపేట పట్టణంలో బేకరీ నిర్వాహకులు కస్టమర్లను ఆకర్షించడానికి బర్త్ డే పాయింట్స్ తో సహా సపరేట్ గా క్యాబిన్ లు ఏర్పాటుచేసి వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అంతేగాక అనాధికారికంగా దీపావళి క్రాకర్స్ ను బేకరిషాపులో విక్రయించడం కొసమెరుపు. షాపులలో జరగరాని ఏదైనా ఫైర్ ఆక్సిడెంట్ జరిగితే క్రాకర్స్ ఉండడం వలన జరిగే నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిసి అనాధికారికంగా విక్రయిస్తున్నారు. సంబందిత శాఖ అధికారులు, ఆహరభద్రత అధికారుల పర్యవేక్షణ కోరవడిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై నర్సంపేట ఫైర్ అధికారులను వివరణ అడగగా బేకరీ షాపులలో క్రాకర్స్ విక్రయించరాదని ఎవరికి అనుమతులు ఇవ్వలేదని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మళ్లీ బిగుసుకుంటున్న హుస్నాబాద్ పిడికిళ్లు!



శాతవాహనులు, రాష్ట్రకూటులు, మొఘలులు, కాకతీయుల పాలనలో హుస్నాబాద్ కీర్తి మకుటంగా నిలిచింది. ఢిల్లీ రాజులపై తిరగబడిన సర్వాయి పాపన్నను కడుపుల దాచుకుంది. రాజుల కాలంలోనే కాదు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ హుస్నాబాద్ ఓ పెద్ద రాజకీయ అడ్డా. రాజకీయ కేంద్రంగా, విప్లవ పోరాటాల నిలయంగా చాలా కాలం పాటు తెలుగునాట అనేక పరిణామాలను ప్రభావితం చేసింది. గడిచిన కొన్ని దశాబ్దాలుగా హుస్నాబాద్ ప్రభావం తగ్గింది. రాష్ట్ర విభజన తర్వాత కనీసం సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంగా కూడా ప్రాభవం పెంచుకునే ప్రయత్నమే జరగలేదని, అభివృద్ధి ముద్ర కూడా కనిపించలేదనే అభిప్రాయం ఉంది. పదేండ్ల అరాచకాన్ని ధిక్కరించిన ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. ఈ ప్రాంతం ఎర్రజెండా పోరాటాలు, ప్రజా ఉద్యమాలకు కేంద్ర బిందువై ఖండాంతర ఖ్యాతిని గడించింది. ఇక్కడి గడ్డ మీద పట్టు నిలుపుకొంటే చాలు రాజకీయంగా ఓ మెట్టుపైన ఉండవచ్చని పార్టీలన్నీ భావించిన రోజులు కూడా ఉన్నాయి. బానిసత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించిన ఈ గడ్డపై బీఆర్ఎస్ వచ్చి ఆనాటి గురుతులను చెరిపేసింది. కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతాన్ని ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా సిద్దిపేట జిల్లాలో కలిపారు. సరిహద్దులు చెరిగిపోయి అభివృద్ధీ మసకబారింది. గత ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన జిల్లాలో కలిసినా ఆ ప్రతిష్ఠకు తగ్గట్టుగా అభివృద్ధి చెందలేదు. దొరతనపు పాలనతో ప్రజల్లో అసంతృప్తి జ్వాలలు రగిలాయి. బిగుస్తున్న పిడికిళ్లకు బేడీలు వేశారు. మోసాలను ఎత్తిచూపే వేళ్లను విరిచేశారు. లాఠీలతో వెన్ను విరిచి నోళ్లు మూయించారు.

### జిల్లాల పునర్విభజన చేసి..

ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు ముందు, ఉమ్మడి రాష్ట్రంలో 23 జిల్లాలు ఉండేవి. 2014లో పది జిల్లాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. జిల్లాల భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా పాలనకు ఇబ్బందులున్నాయని అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సీఎస్ అధ్యక్షతన కమిటీ వేసి జిల్లాల పునర్విభజన చేపట్టింది. కొన్ని జిల్లాల్లో జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాలకు చేరుకోవాలంటే దాదాపు 200 నుంచి 250 కిలో మీటర్ల వరకూ ప్రయాణించాల్సి వచ్చేది. ఈ ఇబ్బందులు అధిగమించేందుకని చెబుతూ కేసీఆర్ అప్పటివరకు ఉన్న జిల్లాల పునర్విభజన చట్టం, 1974కు మార్పులు చేస్తూ బిల్లు నంబర్14ను తీసుకొచ్చారు. 2016 అక్టోబరులో 30 జిల్లాలు ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సంఖ్య కేసీఆర్‌కు కలిసి రావడంలేదని మళ్లీ వనపర్తి, ములు గు, జోగులాంబ గద్వాలను ప్రత్యేక జిల్లాలుగా ఏర్పాటు చేసి జిల్లాల సంఖ్యను 33కు పెంచుకున్నారు. రెవెన్యూ డివిజన్ల సంఖ్య 74కు చేరడంతో పాటు రెవెన్యూ మండ లాలు 612కు పెరిగాయి. అయితే వీటిని అశాస్త్రీయంగా విభజించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### రాజకీయ ప్రయోజనం కోసం..

కేసీఆర్ తన రాజకీయ ప్రయోజనం కోసం హుస్నాబాద్‌ను మూడుముక్కలు చేసి దెబ్బతీశారు. ఇక్కడ సీపీఐ, కాంగ్రెస్ బలంగా ఉండడంతో వాటిని బలహీనపరిచేందుకు కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతాన్ని సిద్దిపేట జిల్లాలో కలిపారు. సిద్దిపేటలో మెడికల్ కాలేజీ ఏర్పాటు కావాలంటే గిరిజన జనాభా ఉండాలని, హుస్నాబాద్ ప్రాంతంలో గిరిజనులు ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంతాన్ని అటు కలుపుకొని లబ్ధిపొందారు. బెజ్జంకి మండలం తోటపల్లికి చెందిన తన్నీరు హరీశ్‌రావు సిద్దిపేట నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఆయనను నాన్ లోకల్ అనకుండా ఉండేందుకు దూరంగా ఉన్న బెజ్జంకిని కూడా సిద్దిపేటలో కలుపుకున్నారు. ఈ ప్రాంతాన్ని కరీంనగర్ లోనే కొనసాగించాలని ఇక్కడి ప్రజలు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. 39 కిలోమీటర్ల దూరం ఉన్న జిల్లా కేంద్రం కరీంనగర్‌కు రవాణా ఈజీగా ఉండేది. 50 కిలోమీటర్లున్న సిద్దిపేట ఎడమచేయిలాగా కావడంతో పాటు పరిపాలనాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని ప్రభుత్వ ఆఫీసులు సంగారెడ్డిలో ఉండడంతో ప్రజలు అంత దూరం వెళ్లేందుకు ఇబ్బందిపడుతున్నారు. దీనికి తోడు నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో ఉంది. నియోజకవర్గంలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలు సిద్దిపేట జిల్లాలో ఉండగా, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరు మండలాలు హనుమకొండలో ఉన్నాయి. చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో కలుపుకున్న బెజ్జంకి మానకొండూరు నియోజకవర్గంలో ఉంది. ఇలా జిల్లాలు, మండలాల వి?భజన అశాస్త్రీయంగా ఉందని, అవసరానికి తగ్గట్టుగా జరగలేదని విమర్శలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు.

### ఇక్కడి ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా..

ఎన్నికల ముందు వరకు మండలాల విభజన చేసుకుంటూ వెళ్లారు. ఇక్కడ కొత్తగా అక్కన్నపేట, వేలేరు మండలాలు ఏర్పాటు చేసినా ప్రభుత్వ ఆఫీసులను నిర్మించలేదు. అక్కన్నపేటలో వెలమదొరల ఆధిపత్యం ఉండేది. దానిని తిరిగి పొందేందుకే మండలంగా మార్చారు. ధరణిని తీసుకొచ్చి ఇక్కడి పేదల భూములన్నీ దొరల పరం చేశారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో విలీనమైనా అందుకు తగినట్టుగా హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధి చెందలేదు. తెలంగాణ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌కు నినాదంగా మారిన శ్రీరాంసాగర్ వరదకాల్వ (ఇప్పటి గౌరవెల్లి ప్రాజెక్టు) నిర్మాణంపై తీవ్ర నిర్లక్ష్యం చేశారు. నిర్వాసితులకు సరైన పరిహారం ఇవ్వకుండా, పోలీసులతో కొట్టించి, వాళ్ల ఇండ్లను కూల్చేసి బలవంతంగా వెళ్లగొట్టారు. కేసీఆర్‌తో పాటు ఆయన అల్లుడు, కొడుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో ప్రాజెక్టులను పూర్తిచేసుకున్నారు. ఇక్కడి ఎల్లమ్మ చెరువును, ఎల్లమ్మగుడిని డెవలప్ చేయలేదు. మరో వేములవాడగా తీర్చిదిద్దేందుకు ఆస్కారమున్న పొట్లపల్లిలోని రాజన్న ఆలయాన్నీ పట్టించుకోలేదు. పేరెన్నిన కొత్తకొండ ఈరన్న గుడిపైనా నిర్లక్ష్యమే చేశారు. పాపికొండలను పోలిన మహాసముద్రంగండి, లోకల్ నయగారాగా చెప్పుకునే రాయికల్ జలపాతాన్నీ పట్టించుకోలేదు. చరిత్రకు ఆనవాలుగా మిగిలిన సర్వాయి పాపన్న కోటనూ అభివృద్ధి చేయలేదు. విద్యా, వైద్యాన్నీ నిర్లక్ష్యం చేశారు. సర్వాయిపేట సమీపంలో దాదాపు 20 కిలోమీటర్ల పొడవున వ్యాపించి ఉన్న ఎత్తైన గుట్టలను పట్టించుకోలేదు.

### ఏడాది కావస్తున్నా కరీంనగర్‌లో కలుపలే..!

తెలంగాణలో జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలకు సంబంధించి మార్పులు చేర్పులు ఉంటాయని స్పష్టమవుతున్న తరుణంలో కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హుస్నాబాద్‌ను పూర్వపు కరీంనగర్ జిల్లాలో కలుపుతరా? జిల్లాగా మార్చుతరా? అనే చర్చ మొదలైంది. ఎన్నికలకు ముందు ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర ద్వారా హుస్నాబాద్ వచ్చి కేసీఆర్ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే హుస్నాబాద్ ప్రాంతాన్ని తిరిగి కరీంనగర్‌లో కలుపుతామని ఇక్కడి అంబేద్కర్ విగ్రహం సాక్షిగా హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించారు. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా హుస్నాబాద్‌ను కరీంనగర్‌లో కలుపుతామన్న హామీపై నోరెత్తకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి రేగుతోంది. ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

### జిల్లా చేయడానికి తగిన వనరులు..

అయితే దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఇదే జరిగితే పార్లమెంటరీ నియోజకవర్గాల సరిహద్దులు మరోసారి మారతాయి. కరీంనగర్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట జిల్లాల కూడలిలో ఉన్న హుస్నాబాద్ ఆ జిల్లాలకు దాదాపు సమాన దూరంలో ఉంది. భౌగోళికంగానూ పెద్ద విస్తీర్ణం కలిగి ఉంది. జిల్లా కేంద్రం చేసేందుకు తగిన వనరులూ ఉన్నాయి. సర్దార్ సర్వాయి పాపన్న పేరుతో గానీ, రేణుకాఎల్లమ్మ పేరుతో గానీ, పీవీ నరసింహారావు పేరుతో గానీ హుస్నాబాద్‌ను జిల్లా చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. హుస్నా బాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి, సైదాపూర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేరుతోపాటు కొత్తగా రామ వరం, ఇందుర్తి లేదా నవాబుపేట, వంగరను మండలాలు చేసి హుస్నాబాద్‌ను జిల్లాగా మార్చాలంటున్నారు. లేకపోతే ఇదే మండలాలతో కరీంనగర్‌లో కలుపుతూ హుస్నా బాద్‌ను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉంచుతూ, ఇక్కడ సబ్ కలెక్టర్ ఆఫీసును ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను కూడా కొందరు ముందుంచుతున్నారు. అయితే ప్రభుత్వం హుస్నా బాద్‌ను కరీంనగర్ జిల్లాలో కలుపుతుందా? జిల్లాగా మార్చుతుందా? అనేది వేచిచూడాలి.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం


## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలకై ఛలో కలెక్టరేట్

వరంగల్ (గౌతమ్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయడానికి నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లాని, ఫీజు బకాయిల విడుదలపై అనాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది నేడు చేస్తున్న జాప్యం ఏంటని, రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్ మండిపడ్డారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకశిలా పార్క్ నుండి విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్ లో వెళ్లేందుకు ప్రయత్నించగా అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్ ధర్నానుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్మెంట్ నిధులు రూ. 7650 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్ లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలలో డబ్బులు కట్టి టి.సి ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని, దీనితో విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదన చెందుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.




అదేవిధంగా బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలల యామాన్యాలు తమ సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక మేము కళాశాలలను నడుపలేమని ఆవేదన వ్యక్తం చేస్తూ నాలుగు రోజులు బంద్ చేసిన ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేకపోగా పెడచెవిన పెట్టడం సిగ్గు చేటని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తుందని ఎన్నికల ముందు పదే పదే మాట్లాడి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పి నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని, విద్యాశాఖ కూడా తన వద్దే పెట్టుకున్న విద్యాశాఖకి నిధులు కేటాయించి విద్యార్థులకు ఖర్చు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని, రాష్ట్రంలో అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం దేనికి సంకేతం అని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజురీయింబర్స్మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని, ఎంతో మంది విద్యార్థులు ఈ పథకం ద్వారా లబ్దిపొందారని, కానీ నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తూ తూట్లు పొడుస్తుందని దుయ్యబట్టారు. ప్రభుత్వం పెండింగ్ ఫీజులను విడుదల చేయకుండా పేద విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తుందని, సర్కారు ఫీజులు చెల్లింపులు చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మొద్దు నిద్రను వీడి పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు టోకెన్ ఇచ్చినవి కాకుండా పెండింగ్ లో ఉన్న బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, త్వరలోనే ఛలో సచివాలయం నిర్వహిస్తామని ఎన్ ఎ స్టాలిన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీకాంత్ కు సమస్యలతో కూడిన మెమొరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థ సారథి, ల్యాదల్లా శరత్, నాయకులు అభిరామ్, రాకేష్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక జనాభా వరమా!



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇష్టమున్నా లేకున్నా జనాభా అంశంపై చర్చ ఊపందుకుంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ మరో ఏణ్ణర్థంలో ప్రారంభం కావాల్సిన నేపథ్యంలో ఈ చర్చ ఎంతో అవసరమైనదీ, తప్పనిసరైనదీ. అయితే ఇందులో ఇమిడివున్న, దీనితో ముడిపడివున్న అనేకానేక ఇతర విషయాలను కూడా స్పృశిస్తే ఈ చర్చ అర్థవంతంగా ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామూహిక వివాహాల సందర్భంగా సోమవారం కొత్త దంపతుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, '2026లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన పుణ్యమా అని చిన్న కుటుంబానికి బదులు ఎక్కువమంది సంతానాన్ని కనాలని ఆశీర్వదించే రోజులొచ్చేశాయి' అని వ్యాఖ్యానించటం గమనించదగ్గది. తెలుగునాట అష్టయిశ్వర్యాలు లభించాలని దంపతులను ఆశీర్వదించినట్టే తమిళగడ్డపై కొత్త దంపతులకు 16 రకాల సంపదలు చేకూరాలని ఆకాంక్షించటం సంప్రదాయం. ఆ ఆకాంక్షను పొడిగించి ఎక్కువమంది పిల్లల్ని కనాలని ఆశీర్వదించాల్సి వస్తుందన్నది ఆయన చమత్కారం. ఆ మాటల వెనక ఆంతర్యం చిన్నదేమీ కాదు. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాక లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలూ అమాంతం 753కు చేరుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. అంటే ఒక్కసారిగా 210 స్థానాలు పెరుగుతాయన్న మాట! ఆ నిష్పత్తిలో శాసన సభల్లో సైతం సీట్ల పెరుగుదల ఉంటుంది. జనాభా పెరుగుదల రేటులో తీవ్ర వ్యత్యాసాలు కనబడుతున్న నేపథ్యంలో అధిక జనాభాగల ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలూ... ఆ పెరుగుదల అంతగా లేని దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ సంఖ్యలో స్థానాలూ వస్తాయన్నది ఒక అంచనా. మరో మాటలో చెప్పాలంటే జనాభా నియంత్రణపైనా, విద్యపైనా, ఆర్థికాభివృద్ధిపైనా పెద్దగా దృష్టి పెట్టని రాష్ట్రాలు లాభపడబోతున్నాయన్నమాట! దేశంలో చివరిసారిగా 1976లో పునర్విభజన జరిగింది. ఈ ప్రక్రియ క్రమం తప్పకుండా చేస్తే సమస్యలకు దారి తీయొచ్చన్న కారణంతో 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి పునర్విభజన ప్రక్రియను 2000 వరకూ స్తంభింపజేశారు. అయితే 2001లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాల హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. దాని ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య, వాటి పరిధి 2026 తర్వాత జరిగే జనగణన వరకూ మారదు. అయితే ఆ పరిధిలోని అసెంబ్లీ స్థానాలను హేతుబద్ధీకరించవచ్చు. దాని పర్యవసానంగా ఉమ్మడి ఏపీ అసెంబ్లీలోని 294 స్థానాల సంఖ్య మారకపోయినా ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో జిల్లాలవారీగా సీట్ల సంఖ్య మారింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇలాగే జరిగింది. ప్రతి రాష్ట్రానికీ దాని జనాభా నిష్పత్తికి అనుగుణంగా లోక్‌సభలో ప్రాతినిధ్యం కల్పించాలని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. దేశంలో ప్రతి ఒక్కరి ఓటు విలువా ఒకేవిధంగా ఉండాలన్నది దీని ఆంతర్యం. 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా వేయక తప్పలేదని కేంద్రం ప్రకటించింది. కనుక వాస్తవ జనాభా ఎంతన్నది తెలియకపోయినా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని సాంకేతిక బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ సంఖ్యను 142 కోట్లుగా లెక్కేస్తున్నారు. రాష్ట్రాలవారీగా జనాభా ఎంతన్న అంచనాలు కూడా వచ్చాయి. దాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఉత్తరప్రదేశ్ నుంచి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 80 కాస్తా 128కి చేరుతాయి. బిహార్‌కు ఇప్పుడు 40 స్థానాలున్నాయి. అవి 70కి ఎగబాకుతాయి. అలాగే మధ్యప్రదేశ్‌కు ఇప్పుడున్న 29 నుంచి 47కూ, రాజస్థాన్‌కు ప్రస్తుతం ఉన్న 25 కాస్తా 44కు పెరుగుతాయని అంచనా. మహారాష్ట్రకు ప్రస్తుతం 48 ఉండగా అవి 68కి వెళ్లే అవకాశం ఉందంటున్నారు. కానీ అదే సమయంలో జనాభా నియంత్రణలో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పెరిగే సీట్ల సంఖ్య స్వల్పంగా ఉంటుంది. దేశ జనాభా వేగంగా పెరుగుతున్నదనీ, ఇదే కొనసాగితే భవిష్యత్తులో అందరికీ చాలినంత ఆహారం లభ్యం కావటం అసాధ్యమన్న అభిప్రాయం ఒకప్పుడుండేది. ఎమర్జెన్సీ రోజుల్లో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించిన ఉదంతాలకు లెక్కేలేదు. మొత్తంగా జనాభా పెరుగుతూనే ఉన్నా, ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశం మనదే అయినా గడిచిన దశాబ్దాల్లో పెరుగుదల రేటు తగ్గింది. ఈ తగ్గుదల సమంగా లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా, ఉత్తరాది రాష్ట్రాల్లో స్వల్పంగా నమోదవుతోంది. ఉదాహరణకు 1951లో తమిళనాడు జనాభా బిహార్ కంటే స్వల్పంగా అధికం. 6 దశాబ్దాల తర్వాత బిహార్ జనాభా తమిళనాడుకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ! దక్షిణాదిన జనాభా పెరుగుదల పెద్దగా లేకపోవటానికి ఆర్థికాభివృద్ధి, స్త్రీలు బాగా చదువు కోవటం, దారిద్ర్యం తగ్గటం ప్రధాన కార ణాలు. దేశ జనాభాలో 18 శాతంగల దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీకి 35 శాతం వాటా అందిస్తున్నాయి. కుటుంబాల్లో స్త్రీల నిర్ణయాత్మక పాత్ర ఉత్తరాదితో పోలిస్తే పెరిగింది. కీలకాంశాల్లో ఉత్తరాది రాష్ట్రాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఈ వైఫల్యం వరం కావటం న్యాయమేనా? స్టాలిన్ మాటల ఆంతర్యం అదే. మరికొందరు నేతలు జనాభా పెంచమంటూ ముసిముసి నవ్వులతో సభల్లో చెబుతున్నారు. ఇది నవ్వులాట వ్యవహారం కాదు. పునరుత్పాదక హక్కు పూర్తిగా మహిళలకే ఉండటం, అంతిమ నిర్ణయం వారిదే కావటం కీలకం. అసలు పునర్విభజనకు జనాభా మాత్రమే కాక, ఇతరేతర అభివృద్ధి సూచీలనూ, దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రాల పాత్రనూ పరిగణనలోకి తీసుకోవటం అవసరం. ఈ విషయంలో విఫలమైతే దక్షిణాది రాష్ట్రాల్లో అసంతృప్తి పెరగటం ఖాయమని కేంద్రం గుర్తించాలి.

# లారెన్స్ బిష్ణోయ్ లింక్స్..
# కెనడా ఆరోపణల్లో కీలక విషయాలు..



ఇంటర్నెట్ డెస్క్: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు భారతదేశం గురించి రహస్య సమాచారాన్ని, కెనడాలో భారత జోక్యంపై అమెరికా వార్తాపత్రికతో పంచుకున్నారు. కెనడా జాతీయ భద్రతా సలహాదారు నథాలీ డ్రౌయిన్ అమెరికా మీడియాకు తెలియజేసినట్లు కెనడా మంగళవారం నివేదించింది. కెనడియన్ ఫెడరల్ పోలీసులు ఆరోపించిన కొన్ని రోజులుకు ముందే సమాచారాన్ని అందించారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యం గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో కెనడాలోని భారత దౌత్యవేత్తలకు సంబంధం ఉందని ఆ దేశ పీఎం జస్టిన్ ట్రూడోతో పాటు అక్కడి ప్రభుత్వం ఆరోపించింది. అయితే, ఎలాంటి సాక్ష్యాలు లేకుండా, భారత ప్రభుత్వం ఖలిస్తానీ మద్దతుదారుల్ని లక్ష్యంగా చేసుకుంటుందని ఆరోపించింది. ఈ ఆరోపణలకు బలమైన సాక్ష్యాలు లేవని స్వయాన కెనడా పీఎం ట్రూడోనే వెల్లడించాడు. భారత్ గత ఏడాదిగా సాక్ష్యాలు సమర్పించాలని కెనడాని కోరుతోంది. కెనడా వార్తాపత్రిక ది గ్లోబ్ అండ్ మెయిల్ చెబుతున్న దాని ప్రకారం.. నథాలీ డ్రౌయిన్‌తో పాటు గ్లోబల్ అఫైర్స్ డిప్యూటీ మినిస్టర్ డేవిడ్ మారిసన్ వాషింగ్టన్ పోస్టుతో మాట్లాడినట్లు తెలిపింది. కెనడాలో భారత జోక్యంతో పాటు సెప్టెంబర్ 2023న సిక్ లీడర్, ఖలిస్తానీ ఉద్యమంతో సంబంధం కలిగి ఉన్న సుఖ్‌దూల్ గిల్ హత్యలో భారత జోక్యం గురించి మాట్లాడినట్లు తెలిసింది. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ కెనడాలోని సర్రేలో హత్య జరిగిన తర్వాత గిల్ హత్య జరిగింది. అయితే, తాము ఎలాంటి సమాచారం పంచుకోలేదని వారిద్దరు చెప్పారు.

# ఉగ్రవాదంపై దేశాలు కలిసి పోరాడాలి..
# బ్రిక్స్ సదస్సులో మోడీ పిలుపు



**న్యూఢిల్లీ,:** ఉగ్రవాదంపై అన్ని దేశాలు కలిసి పోరాడాలని బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. రష్యాలోని కజాన్‌లో జరిగిన 16వ బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ సందర్భంగా పుతిన్‌పై ప్రశంసలు కురిపించారు. బ్రిక్స్ సమావేశాన్ని పుతిన్ విజయవంతంగా నిర్వహించారంటూ కొనియాడారు. భవిష్యత్‌లో బ్రిక్స్ మరింత పటిష్టమైన వేదిక అవుతుందని ఆకాంక్షించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధిపై బ్రిక్స్ దృష్టి పెట్టాలని సూచించారు. ప్రపంచంలో 40 శాతం జనాభాకు బ్రిక్స్ ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తల్లి పేరుతో మొక్క నాటే కార్యక్రమాన్ని భారత్‌లో చేపట్టినట్లు గుర్తుచేశారు. ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరి ఉండటం సరికాదని.. ఉగ్రవాదంపై అన్ని దేశాలు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన మద్దతు అవసరమని.. ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదన్నారు. అలాగే గ్లోబల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో సంస్కరణలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇక బ్రిక్స్ దేశాలు లోకల్ కరెన్సీ ద్వారా వ్యాపారం చేసుకోవడాన్ని ప్రోత్సహించాలని ప్రధాని మోడీ కోరారు. ద్రవ్యోల్బణం, ఆహార భద్రత, సైబర్ బెదిరింపులు వంటి ప్రపంచ సవాళ్లను గురించి కూడా మోడీ ప్రస్తావించారు. "ద్రవ్యోల్బణాన్ని నిరోధించడం, ఆహారం మరియు ఇంధన భద్రత, ఆరోగ్య భద్రత మరియు నీటి భద్రతను రక్షించడం ప్రపంచంలోని అన్ని దేశాలకు ప్రాధాన్యతనిచ్చే అంశాలు" అని మోడీ పేర్కొన్నారు. గ్లోబల్ ఇన్‌స్టిట్యూషన్‌లలో సంస్కరణల కోసం బ్రిక్స్ భాగస్వాములు సమిష్టిగా తమ గళాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. సురక్షితమైన కృత్రిమ మేధస్సుతో పాటు సైబర్ భద్రత కోసం ప్రపంచ నిబంధనల కోసం దేశాలు కృషి చేయాలన్నారు.

# మిస్టరీగా మారిన.. షేక్ హసీనా 'రాజీనామా లేఖ'!



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో విద్యార్థుల ఆగ్రహానికి గురైన షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి దేశం వీడాల్సి వచ్చింది. అక్కడ తాజాగా మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే, ఈసారి మాత్రం దేశాధ్యక్ష పదవి నుంచి మొహమ్మద్ షహాబుద్దీన్ వైదొలగాలని డిమాండు చేస్తూ అధ్యక్ష భవనం 'బంగాభబన్'ను ఆందోళనకారులు చుట్టుముట్టారు. ఇందుకు షేక్ హసీనా 'రాజీనామా లేఖ' కారణమయ్యింది. ఆ లేఖ గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు తాజా దుమారానికి తెరలేపాయి. ఇంతకీ ఏం జరిగిందంటే..! బంగ్లాదేశ్ అధ్యక్షుడు మొహమ్మద్ షహాబుద్దీన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ఆ రోజు షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసినట్లు విన్నాను. అయినప్పటికీ దానిని ధ్రువీకరించేందుకు రాజీనామా లేఖ సహా నా దగ్గర ఎటువంటి ఆధారాలు లేవు. ఎంత ప్రయత్నించినా ఆ లేఖ లభ్యం కాలేదు. బహుశా లేఖ ఇచ్చేందుకు ఆమె (షేక్ హసీనా)కు సమయం ఉండకపోవచ్చు" అని పేర్కొన్నారు. ఇదే విషయంపై సైన్యాధిపతిని వాకబు చేయగా అక్కడ నుంచీ ఇదేవిధమైన సమాధానం వచ్చిందన్నారు. హసీనాను దించేయడం వెనక కుట్ర: యూనస్ సంచలన వ్యాఖ్యలు హసీనా రాజీనామా లేఖ గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై తాత్కాలిక ప్రభుత్వం అసహనం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు విరుద్ధ ప్రకటనలు చేశారని ప్రస్తుత ప్రభుత్వ న్యాయ సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ పేర్కొన్నారు. "తన వద్ద హసీనా రాజీనామా లేఖ లేదని అంటున్నారు. ఆగస్టు 5న త్రివిధదళాధిపతుల సమక్షంలో జాతినుద్దేశించిన ప్రసంగంలో హసీనా రాజీనామా చేశారని.. తాను ఆమోదించానని అధ్యక్షుడు చెప్పారు. ఇప్పుడు మాత్రం తనవద్ద ఆ లేఖ లేదని చెబుతున్నారు" అని చెప్పారు. ఇదిలాఉంటే, రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలతో బంగ్లాదేశ్ ఇటీవల అట్టుడుకిపోయింది. అవి హింసాత్మకంగా మారడం, దాదాపు 300 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో షేక్ హసీనా అధికార నివాసాన్ని ఆందోళనకారులు ముట్టడించారు. దీంతో ఆగస్టు 5న దేశాన్ని వీడిన హసీనా.. భారత్‌కు వచ్చి ఆశ్రయం పొందారు. అనంతరం బంగ్లాలో కొత్త ప్రభుత్వం ఏర్పడి.. పరిస్థితులు కుదుటపడుతోన్న సమయంలోనే హసీనా రాజీనామా గురించి అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు మరోసారి ఆందోళనలకు కారణమయ్యాయి.ఎ

# నాంపల్లి స్పెషల్ కోర్టుకు కేటీఆర్



**హైదరాబాద్, :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీంతో కేటీఆర్ నాంపల్లి కోర్టులో కొండా సురేఖ పై పరువు నష్టం దావా వేశారు. పరువు నష్టం దావా పై తాజాగా నాంపల్లి స్పెషల్ కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేతలు జగదీశ్ రెడ్డి, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ ఉన్నారు. ఇటీవలే సినీ నటులు నాగచైతన్య-సమంత విడాకులకు కారణం కేటీఆర్ అని సంచలన వ్యాఖ్యలు చేశారు కొండా సురేఖ. పలువురు హీరోయిన్ల ఫోన్లను ట్యాపింగ్ చేశారని.. కేటీఆర్ వల్లనే కొంత మంది హీరోయిన్లు త్వరగా పెళ్లి చేసుకున్నారని తెలిపారు. మరోవైపు పలువురికి డ్రగ్స్ అలవాటు చేసింది కూడా కేటీఆర్ అంటూ మండిపడ్డారు. సినీ ఇండస్ట్రీ వాళ్ల జీవితాలతో ఆడుకొని.. వాళ్లను బ్లాక్ మెయిల్ చేసింది కేటీఆర్ కాదా..? అంటూ ఆమె ప్రశ్నించారు. మరోవైపు కొండా సురేఖ వ్యాఖ్యలపై పలువురు సినీ ప్రముఖులు కూడా స్పందించారు. మాకు సంబంధం లేని వ్యవహారంలో మమ్ముల్ని ఎందుకు లాగుతున్నారని కేటీఆర్ అడిగారు. కొండా సురేఖ పై రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేశారు కేటీఆర్.

# ప్రత్యక్ష నిరసనోద్యమమే పరిష్కారం!

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలో, ప్రపంచవ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారిన పేరు ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా. ఆయన అకస్మాత్తుగా, అకాల మరణం పొందిన నాటి నుండి నేటి వరకు సంతాప సభలు సమావేశాలు ఏదో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. దిన పత్రికల్లో, టీవీ ఛానళ్లలో, సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే ఉంది. ఆయన అకాల మరణంపైన, ఆయన ఔన్నత్యంపైన, పాలకులపైన, న్యాయస్థాన తీర్పులపైన విశ్లేషణలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక రకంగా చెప్పాలంటే వ్యవస్థను పోస్టుమార్టం చేసినంత పని చేస్తున్నారు. మేధావులు, రాజకీయ నాయకులు, వివిధ వర్గాల ప్రజలు చర్చోపచర్చలు చేస్తున్నారు. ఒక రకంగా ఇదంతా మంచి పరిణామమే. కానీ, సాయిబాబా పనిచేసిందీ, కోరుకున్నదీ ఇందుకోసం మాత్రమే కాదు. ప్రత్యక్ష నిరసన, ఉద్యమ కార్యాచరణ అనివార్యతను గుర్తించి నడుచుకోవడం పౌర సమాజం బాధ్యత. నిజాలు చెప్పినందుకు, అమాయకులకు అండగా నిలిచినందుకు, యువతను చైతన్యపరచినందుకు, జాతి విముక్తి కోసం పోరాడినందుకు, స్వాతంత్ర అభిలాష వ్యక్త పరిచినందుకు పాలకులు కక్ష కట్టడం, బలి తీసుకున్న ఘటనలు చరిత్రలో అడుగడుగునా కనిపిస్తాయి. సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రచారం చేసినందుకు బ్రూనోను పలు చిత్రహింసలకు గురి చేసి సజీవ దహనం చేశారు. మూఢనమ్మకాలను ప్రశ్నించి, జ్ఞాన మే ధర్మమని యువకులను చైతన్యపరచినందుకు సోక్రటీసుకు విషమిచ్చి చంపారు. బానిసల విముక్తి కోసం తిరుగుబాటు చేసిన నాయకుడు స్పార్టకస్‌ను శిలువ వేసి చంపారు. ఆదివాసుల, మూలవాసుల స్వాతంత్ర్య కాంక్ష కోసం ఉద్యమించిన కొమురం భీం, రాంజీ గోండు, సీతారామరాజులను చంపేశారు. భగత్ సింగ్ ఆజాద్ సుఖదేవ్‌లను చెరసాల పాలు చేసి ఉరికంబం ఎక్కించారు.

## మన కళ్లముందే బలైన సాయిబాబా

ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని చారిత్రక వాస్తవాలు. ఆదివాసులు దళితులు, మైనారిటీలు, అణచివేతకు గురవుతున్న జాతులకు అండగా నిలినందుకు జి. ఎన్ సాయిబాబా మన కళ్ల ముందే బలయ్యాడు. కేవలం 58 ఏళ్ల వయసులో 90% వికలాంగుడిగా ఉండి ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆయనకు మరణం సంభవించింది. అన్యాయంగా సుమారు పదేళ్ల పాటు అత్యంత ఘోరమైన అండా సెల్‌లో నిర్బంధించడమే అందుకు ప్రధాన కారణం. నిర్బంధ కాలంలో సరైన వైద్య సౌకర్యం అందక, సరైన వసతులు లేక, స్వచ్ఛమైన గాలి లభించక, మనుష్య సంబంధాలు దూరమై ఒంటరితనం కారణంగా తీవ్ర మానసిక వేదనకు గురై తీవ్ర యాతన అనుభవించాడు. ఈ పదేళ్ల జైలు నిర్బంధ కాలమే ఆయన మృత్యువుకు దారి తీసింది.



## ఐరాస జోక్యం చేసుకున్నా ఫలించలేదు!

సాయిబాబా విడుదల కోసం అనేక ప్రజా సంఘాలు, పలు యూనివర్సిటీల మేధావులు, విద్యార్థులు, రచయితలు, కవులు, కళాకారులు చేసిన విజ్ఞప్తులు ఫలించలేదు. చివరకు ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. తన మాతృమూర్తి అంత్యక్రియలకు హాజరయ్యేందుకు మానవతా దృష్టితో నైనా అనుమతి లభించలేదు. చావును నిరాకరిస్తున్నారని బహిరంగంగా ప్రకటించి, చనిపోయే ఆరు మాసాల ముందు నిర్దోషిగా విడుదలైన పోరాటయోధుడు సాయిబాబా. ఆయన విడుదలై బయటకు వచ్చిన సమయంలో ఈ వాతావరణం ఆయనకు ఒక కొత్త అనుభూతిని ఇచ్చింది. తర్వాత ఏం చేస్తారని విలేకరులు అడిగిన ప్రశ్నకు, ప్రజాసేవకే పునరంకితమవుతానని బలంగా ప్రకటించాడు. ఆదివాసుల కోసం, వారికి రక్షణ ఇచ్చే అడవి కోసం, శతాబ్దాలుగా వారి కాళ్ల కింద రక్షణలో ఉన్న ఖనిజాలను కార్పొరేట్ సంస్థల దోపిడీకి గురికాకుండా కాపాడేందుకు కృషి చేశారు. తనకు అంగవైకల్యం శరీరానికి మాత్రమే, మనసుకు కాదని ప్రకటించే ఆచరణతో చేశారు.

## మెదడు చురుగ్గా పనిచేయడమే నేరమని..

తూర్పుగోదావరి జిల్లా అమలాపురం నుంచి వచ్చి హైదరాబాద్, ఢిల్లీలో చదువు పూర్తి చేసి, ఉద్యోగం చేసినా జీవితకాలం ప్రజాస్వామ్య తెలంగాణ రాష్ట్ర సాధన కోసం, దేశవ్యాప్తంగా అణగారిన వర్గాల, ఆదివాసుల, వివిధ జాతుల విముక్తి పోరాటాల గురించే ఆలోచించాడు, చర్చించాడు, కార్యోన్ముఖుడై పనిచేశాడు. ఈ దేశ ప్రజల హక్కుల కోసం, కనీసం రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల రక్షణ కోసం ఆలోచించడమే పెద్ద నేరం అయింది. మెదడు చురుగ్గా పని చేయడమే బెయిల్ రాకుండా, ఘోరమైన శిక్ష విధించేందుకు కారణంగా కోర్టు వివరించింది. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ చేసిన అన్వేషణల విషయానికొస్తే ఆయనలో చైతన్యవంతంగా పని చేసింది కేవలం మెదడు మాత్రమే. ఇటు సాయిబాబా, అటు స్టీఫెన్ హాకింగ్ వీల్ చైర్‌కు మాత్రమే పరిమితమై భవిష్యత్ తరాల కోసం తమ జీవితాలను అంకితం చేశారు. సాయిబాబాకు వేసిన శిక్ష, స్టీఫెన్ హాకింగ్‌కు కూడా వేసి ఉంటే సైన్స్ పురోగతి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

## నాటి ప్రత్యక్ష కార్యాచరణ ఇప్పుడేది?

మానవాళి అభివృద్ధి కోసం, ప్రకృతి వనరుల రక్షణ కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం, నిజాలు మాట్లాడినందుకు, దుర్మార్గాలను ప్రశ్నించినందుకు గొంతు నొక్కి వేయడం, జైళ్ల పాలు చేయడం, పలు రకాలుగా చంపడం నిత్యకృత్యమైంది. చనిపోయిన వెంటనే ఘనంగా అంతిమయాత్ర నిర్వహించడం, నిరసనగా బిగ్గరగా నినదించడం, ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాలలో చర్చలు జరపడం, సభలు సమావేశాలతో హోరెత్తించడం ఆనవాయితీగా మారింది. ఈ స్ఫూర్తి వారిని బతికించుకునేందుకు, కాపాడుకునేందుకు అవసరమైన ప్రతిఘటన రూపంలో కానరావడం లేదు. అమాయకులను ఎందుకిలా అక్రమంగా నిర్బంధిస్తున్నారని గానీ, వేధిస్తున్నారని గానీ ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణతో రాజ్యాన్ని అడ్డుకున్న ఘటనలు అరుదుగా ఉన్నాయి. భూమయ్య, కిష్టాగౌడ్‌లకు ఉరిశిక్ష విధించిన సమయంలో శ్రీ శ్రీ నాయకత్వంలో పౌర సమాజం జైలు వద్దే నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో పలుమార్లు వాయిదా పడింది. చిలకలూరిపేట బస్సు దహనం కేసులో ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మార్చారు. కారంచేడు ఘటనపై స్థానికంగా ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరి పారు. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. సరైన సమయంలో ప్రత్యక్ష కార్యాచరణతో, సంఘటితంగా ఉద్యమించి పాలకుల దుర్నీతిపై పోరాడితే అనేక మందిని ప్రాణాలతో దక్కించుకో గలిగేవాళ్లమేమో..?

## పీడితుల పక్షం వహిస్తే పాశవిక శిక్షలు

ఫ్యాక్షనిస్టులు, రాజకీయ నాయకులు చేస్తున్న అకృ త్యాలు, హత్యలపై సరైన విచారణ ఉండదు, శిక్షలు ఉండవు. బడుగు బలహీన వర్గాలకు, పీడిత తాడిత ప్రజలకు అండగా నిలిచి పోరాడిన వారికే కొత్త కొత్త చట్టాలతో పాశవిక శిక్షలు. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు కోసం, ప్రాథమిక హక్కుల కోసం ఉద్యమించడమే కాక, పాలకులను నిలదీసి ప్రశ్నించనంత కాలం సాయిబాబాలు వేధింపబడుతూనే ఉంటారు. వేటాడబడుతూనే ఉంటారు. బాధింపబడుతూనే ఉంటారు. బలవుతూనే ఉంటారు. పాలకుల ఫాసిస్ట్ వైఖరిని ప్రతిఘటించకపోతే, ఇలాంటి పాశవిక చర్యలు పునరావృతం అవుతాయి. పాలకు లు అమలు పరుస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ఖండించాలి, ప్రతిఘటించాలి. మానవతావాది సాయిబాబా రగిలించిన స్ఫూర్తితో ప్రజలను చైతన్యపరచాలి.

# పార్ట్ టైం అధ్యాపకులకు అభయహస్తం అందించండి!

తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంలో, ఆ పార్టీ నాయకులకు ఎంత పాత్ర ఉందో, దానికి సమానమైన పాత్రను రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన వారి పాత్ర అంతే ఉంది. రాష్ట్రంలో ఆ పార్టీ అన్ని వర్గాలకు సంబంధించి డిక్లరేషన్‌లను విడుదల చేసింది. ఇందులో ముఖ్యంగా రైతు డిక్లరేషన్, నిరుద్యోగ డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్ లాంటివి ముందుగానే విడుదల చేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే వారు ఇచ్చిన హామీల ప్రకారం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయాన్ని ఎటువంటి షరతులు లేకుండా మహిళలందరికీ వర్తింపజేశారు. అలాగే గృహలక్ష్మీ పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళలకు అందజేస్తున్నారు. పేద మహిళలకు 500 రూపాయలకు సబ్సిడీ ద్వారా వంటగ్యాస్‌ను అందించడం మూలంగా పేదవారి ఇండ్లలో వెలుగును నింపే పథకాన్ని కూడా ప్రారంభించారు. నిరుద్యోగ డిక్లరేషన్‌లో భాగంగా ఉద్యోగ క్యాలండర్లను ప్రకటించారు. ఇలా అన్ని రంగాలకు సంబంధించిన విషయాలను పరిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యావ్యవస్థలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ (%ఖుతీ-ుఅఎవ%) గురించి మాత్రం పట్టించుకోకపోవడం ఒక రకంగా ఆ వర్గంలో నిరాశను కలిగిస్తుంది.

## నియామకాలు పూరించకపోవడంతో..

గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విశ్వవిద్యాలయాలను కావాలనే విస్మరించినట్లు మనకు వారి విధానాలను పరిశీలిస్తే అర్థమవుతుంది. రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల్లో ఏ ఒక్క వర్సిటీకి కూడా సరైన బడ్జెట్ అందించక ఉన్నత విద్య కుంటుపడే విధంగా చేసింది. వీటిలో ఖాళీలను పూరించేందుకు జాప్యం చేస్తూ అచేతన స్థితిలో పడేసి 10 సంవత్సరాల కాలాన్ని గడిపేసింది. అలాగే ప్రైవేటు విశ్వవిద్యాలయాన్ని ప్రోత్సహించి కార్పొరేట్ విద్యావంతులకు వారి విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేసుకునే వెసులుబాటును కల్పించింది. 2013 తర్వాత నియామకాలు లేకపోవడం వల్ల తెలంగాణ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో పర్మినెంట్ ఫ్యాకల్టీలు లేక ఒప్పం ద, పార్ట్ టైం అధ్యాపకులపై ఆధారపడి విద్యాలయాలను నడిపించే పరిస్థితి ఉంది. నిరుపేద వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు చదువుకునే విశ్వ విద్యాలయాలలో సరైన వసతులు, బోధన సిబ్బంది లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ



కుంటుపడటంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ర్యాంకులలో కూడా తెలంగాణ విశ్వవిద్యాయాలు చాలా వెనుకబడి ఉన్నాయి.

## ఎటువంటి ఉద్యోగ భద్రత లేకుండా..

తెలంగాణ రాష్ట్రంలో పది ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో దాదాపు 1700 మంది తాత్కాలిక అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. ఇందులో చాలామందికి గతంలో చిన్న ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చినా ఉన్నత విద్యను అభ్యసించాలని అభిలాషతో తమ ఉద్యోగాలను వదిలి పీహెచ్‌డీ, పీడీఎఫ్ లాంటి ఉన్నత డిగ్రీలను పూర్తి చేశారు. ఈ ఉన్నత చదువులే ఈ రోజున వారికి శాపంగా మారాయి. ఎందుకంటే, గత ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో ఉన్న ఖాళీలను పూర్తి చేయక, కాలయాపన చేయడం ద్వారా వారికి సకాలంలో విశ్వవిద్యాలయంలో పనిచేసే అవకాశం లభించక, అక్కడే పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. వీరికి సర్వీస్‌కి సంబంధించిన నిబంధనలు లేవు. కనీసం వారికి అసోసియేట్ ప్రొఫెసర్ అయ్యే అవకాశం కూడా కల్పించలేదు. ఎటువంటి ఉద్యోగ భద్రత గాని, ఆర్థిక భద్రత గాని లేదు. వేతన చెల్లింపులలో కూడా ఒక్కొక్క విశ్వవిద్యాలయం ఒక్కొక్క నియమాన్ని పాటిస్తూ ఉంది. వేతనంలోనూ చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. వారికి అందించే వేతనం చాలా తక్కువ.


## సెలవురోజుల్లో పస్తులే..!

అన్ని యూనివర్సిటీలలో సెమిస్టర్ విధానం ఉండడం మూలంగా దాదాపుగా ప్రతి సెమిస్టర్‌కి 90 రోజుల పనిదినాలను నిర్ణయిస్తారు. ఈ 90 రోజుల పని దినాల్లో ప్రభుత్వ సెలవులు వచ్చిన పరీక్షలు జరిగినా, పండగలు వచ్చినా, బందులు చేపట్టినా మొదటగా విశ్వవిద్యాలయంలో నష్టపోయే వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే వారు పార్ట్ టైం అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే. సెలవు రోజున మిగతా ఉద్యోగస్తులు అందరూ సంతోషంగా గడిపితే ఈ పార్ట్ టైం అధ్యాపకులు మాత్రం ఆ రోజున వేతనం లేదని బాధపడటం గమనించవచ్చు. పైగా ప్రతి సెమిస్టర్‌కి దాదాపుగా నెల రోజుల సెలవులు వస్తాయి. ఈ రోజులలో వారికి వేతనం లభించదు. దీంతో ఈ కాలంలో వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలా సంవత్సరం పొడవునా కేవలం ఆరు నెలల జీతంతో అర్ధాకలితో తమ జీవితాన్ని గడుపుతున్నారు. కానీ పనిలో మాత్రం పర్మినెంట్ అధ్యాపకులతో సమానంగా పనిగంటలు కేటాయించడం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయడం వారికి లభించే కొంత వేతనాన్ని కూడా తగ్గించే ప్రయ త్నంలో ఉన్నతాధికారులు ఉంటారు.

## నేటికీ అమలు కాలేదు..

ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన అభయహస్తం వారి జీవితంలో వెలుగునిస్తుందని వారు భావించారు. ప్రభుత్వం ఏర్పడగానే తమ సమస్యలను పరిష్కరిస్తుందని భావించారు. దురదృష్టవశాత్తూ ఇప్పటికీ వారికి ఎటువంటి ప్రతిఫలం లభించలేదు. కాంగ్రెస్ పార్టీ అభయహస్తంలో భాగంగా విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అధ్యాపకులకు 50 వేల రూపాయల కనీస జీతం 12 నెలల పాటు ఇస్తామని మేనిఫెస్టోలో పొందుపరిచారు. కానీ ఇప్పటికీ ఇది అమలు కాలేదు. కాబట్టి ప్రభుత్వం ఈ విషయాన్ని ఇప్పటికైనా పరిగణనలోకి తీసుకొని విశ్వవిద్యాలయాల్లో పనిచేసే పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తారని భావిస్తున్నాం. సుప్రీంకోర్టు తీర్పు ననుసరించి సమాన పనికి సమాన వేతనం సూత్రాన్ని దృష్టిలో ఉంచుకొని వారి జీవితాల్లో వెలుగులు నింపాలని విన్నవించుకుంటున్నాం. రాష్ట్ర ముఖ్యమంత్రి అందరి సమ స్యను పరిష్కరించి వారి జీవితాల్లో వెలుగు నింపినట్లుగానే వర్సిటీల్లోని పార్ట్ టైమ్ అధ్యాపకులపై కూడా తమ దృష్టిని కేంద్రీకరించాలని ఆశిద్దాం.

# 'అసలు' మిగిలే ఉంది




అనుకున్నట్టే వాంగ్చుక్ తన దీక్ష విరమించారు. అనుకున్నట్టే కేంద్రం ఒక మెట్టు దిగింది. హోంశాఖ సహాయ మంత్రిని చర్చలకు పంపుతానంది. మోడీ, షాలతోనే చర్చిస్తానన్న వాంగ్చుక్ బృందం తమ పట్టు సడలించింది. పదహారు రోజుల దీక్ష అంకం ముగిసింది. ఈ దీక్ష విరమిస్తూ వాంగ్ చుక్ 'తాను మరోసారి దీక్ష బూనాల్సిన స్థితి రాదనే ఆశిస్తున్నా'నన్నాడు. అదే జరగాలని ఆశిద్దాం. అక్కడ, అంటే లడఖ్లో ఉద్యమిస్తున్నది ఒక వ్యక్తి కాదు. కాబట్టి, ఒక వ్యక్తితోనో, పార్టీతోనో చర్చలు కాదు. మో-షా బృందానికి ఆర్టికల్ 370 రద్దు చేసినంత తేలికగా ఈ సమస్య పరిష్కారమయ్యేలా లేదు. ఇప్పటికే లడఖ్ బౌద్ధ సంఘాల కో-కన్వీనర్ డోర్జే లాక్రుక్ 'తమ నాలుగు పాయింట్ల ఎజెండా నుండి వెనక్కి తగ్గేదేలే' అని ప్రకటించారు. కొందర్ని కొన్నిసార్లు మోసం చేయొచ్చుగానీ అందర్నీ అన్నిసార్లూ మోసం చేయలేరన్న నానుడి భారతీయ జనతా పార్టీకి ఎంత తొందరగా అర్థమైతే లడఖ్కు అంత మంచిది. లడఖ్ రెండు స్వయం ప్రతిపత్తిగల ప్రాంతాల సమూహం. అవి అపెక్స్ బాడీ, కార్గిల్ డెమోక్రటిక్ అలయెన్సు. జమ్ముకాశ్మీర్ ప్రజల సంస్కృతి వేరు, లడఖ్ ప్రజల సంస్కృతి వేరు. మతం వేరు. మనోభావాలు వేరు. 2019లో ఆర్టికల్ 370 రద్దు సందర్భంలో లడఖ్లో విస్తృత చర్చ జరగలేదు. ప్రజల ఆమోదం లేదు. కొందరు వ్యక్తుల ఆమోదం తీసుకుని లడఖ్ను ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటుచేశారు. 'లోక్నీతి' సర్వే ప్రకారం కాశ్మీర్ లోయలో దాదాపు ప్రజలంతా 370 అధికరణ రద్దును వ్యతిరేకిస్తున్నారు. హిందువులు మెజారిటీగా ఉన్న జమ్మూలో 40శాతం మంది ప్రజలు ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తున్నారు.

అత్యధిక మంది 370 ఆర్టికల్ను పునరుద్ధరించాలని కోరుతున్నారని లోక్నీతి సర్వే పేర్కొంది. లడఖ్లో కొందరైనా వ్యతిరేకించక పోవడానికి కారణం నాటి జమ్మూకాశ్మీర్ శాసనసభలో మెజారిటీ జమ్మూ-కాశ్మీర్ వారే ఉండటంవల్ల తమ ఆకాంక్షలు నెరవేరడం లేదని భావించారు. కానీ, కేంద్ర పాలిత ప్రాంతమైన తర్వాత కేంద్రమే పాలిస్తుందని పసిగట్టలేకపోయారు. మొన్నటితో వాంగ్చుక్ నిరవధిక దీక్ష ముగిసినా ఆయన లేవనెత్తిన పర్యావరణ సమస్యలు అలానే ఉన్నాయి. 'పర్యావరణం' పెట్టుబడిదారీ విధానానికి విలోమాను పాతంలో ఉంటుంది. అందుకే అనేక పశ్చిమదేశాల్లో పర్యావరణ వేత్తలు, గ్రీన్స్ మూవ్మెంట్ సోషలిస్టు, కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమిస్తున్నారు. ఇది వాంగ్చుక్ వంటి వారి దృష్టిలో ఉందా అనేది పరిశీలించుకోవాలి. అక్కడి పర్యావరణాన్ని దెబ్బతీసేలా ఖనిజ నిక్షేపాలను తవ్వనిస్తారా, లేదా చూడాలి. ఇజ్రాయిల్ బంధం గట్టిగా బిగిసిపోయినాక ఆయుధాలు, మందుగుండు తయారీలో లడఖ్లో విస్తారంగా దొరికే గంధకం (సల్ఫర్)ను అదానీ హస్తగతం కాకుండా మోడీ సర్కార్ నియంత్రిస్తుందా? లడఖీయుల ప్రధాన డిమాండ్ వారికి రాష్ట్ర హోదా లేదా ఆరవ షెడ్యూల్లో చేర్చాలనే డిమాండ్లు కీలకమైనవి. మిగతా దేశమంతాలాగానే ఉపాధి సమస్య వారికీ ప్రధానం. 370 అధికరణం రద్దుచేసి తమ జీవిత లక్ష్యం నెరవేరినట్లు ఆర్ఎస్ఎస్, బీజేపీలు 2019 నుండీ చంకలు గుద్దుకుంటున్నాయి. కాని నేడు ప్రజల నిత్య జీవిత సమస్యలను ముందుకు తెచ్చింది వాంగ్ చుక్ బృందం. ఏడాదంతా మంచు దుప్పటి పరుచుకునుండే ప్రాంతంలో పశువులకు అవసరమైన పచ్చిక మైదానాలు, మనుషులకు (పశువుల్తో సహా) మంచినీరు అందించడం కీలకమైంది. 370 రద్దుతో 'స్కీయింగ్' (మంచులో ఆడే ఆటల) కోసం భారత పెట్టుబడిదార్లు ఇప్పటికే వెంపర్లాడుతున్నారు. వెరసి, ఇవన్నీ ఆ ప్రాంత పర్యావరణాన్ని ధ్వంసం చేస్తాయని ఆ ఉద్యమం ఆరోపిస్తోంది. అందుకే, 370 అధికరణం రద్దు కోసం 2019లో మోడీ బృందం నయానా, భయానా చాలామందిని లొంగదీసుకుంది. కాని నేడు ఈ ఉద్యమం లేవనెత్తిన కీలక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందా? 370 ఆర్టికల్ రద్దును ఉపసంహరించాలనే పార్టీల కూటమి నేడు జమ్మూ-కాశ్మీర్లో అధికారంలో ఉంది. ఇప్పటికే వారి క్యాబినెట్ ఆ డిమాండ్ను పునరుద్ఘాటించింది. ఆ సమస్య ఎలా ఉన్నా లడఖ్కు రాష్ట్ర హోదా కల్పించాలనే న్యాయ సమ్మత డిమాండ్ను ఆమోదించడం మోడీ సర్కార్కు తప్పనిసరి.